


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

27.08.2026

గురువారం| రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 58

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.




# రాజకీయం రసవత్తరం

- సీఎం వర్సెస్ కొండా సురేఖ
- భట్టి విక్రమార్కతో కొండా మురళి సమావేశం
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి భేటీ
- కొండా సురేఖ వివాదం వేళ ఘటన
- ఈ భేటీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా
- సుస్మిత కామెంట్లతో సంబంధం లేదు

**హైదరాబాద్, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సుస్మిత వ్యాఖ్యలు, మంత్రి కొండా సురేఖ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్నవేళ మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ నేత, కొండా సురేఖ భర్త కొండా మురళి.. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సమావేశం కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అయితే ఈ భేటీకి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హాజరు కావడం రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు దారి తీసింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొనడంతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.**

మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన వ్యవహారంపై ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ..టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు నివేదిక సమర్పించిన నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భట్టి విక్రమార్కతో కొండా మురళి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమావేశం కావడం ఆసక్తిని రేపుతోంది.

అయితే ఈ భేటీ తర్వాత బయటికి వచ్చిన కొండా మురళి మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొండా సుస్మితకు తన అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందని.. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదని పేర్కొన్నారు.

తమ బిడ్డ చేసిన వ్యాఖ్యలతో తమాకేం సంబంధం అని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. ఇక.. తమకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీపై గౌరవం, పూర్తి విశ్వాసం ఉందని కొండా మురళి తెలిపారు. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్కను ఒక బిల్లు విషయమై కలిశానని.. ఈ సమావేశంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వ్యవహారంపై చర్చించలేదని తేల్చి చెప్పారు.


**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా భట్టి విక్రమార్కతో**

మరోవైపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా భట్టి విక్రమార్కతో సమావేశం కావడం ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన భేటీకి కారణాలపై కాంగ్రెస్ వర్గాల్లో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశంలో ఏ అంశాలపై చర్చ జరిగిందనే దానిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడికి చేరిన నేపథ్యంలోతదుపరి చర్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ పరిణామాల మధ్య కీలక నేతల వరుస భేటీలు తెలంగాణ కాంగ్రెస్‌లో మరింత ఉత్కంఠను పెంచుతున్నాయి.

## భారత్ మాతాకీ జై.. మీరు చెప్పాల్సింది కానీయ్యండి

- మహిళలను ట్రోల్ చేయడం ఆపు
- మండీ ఎంపి, బాలీవుడ్ నటి కంగనా
- రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు

2లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. నటి కృతి సనన్ రక్షా బంధన్ వాణిజ్య ప్రకటనపై వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలకు కంగనా తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు.

## వందేమాతరం గేయంలో రెండు చరణాలనే పాడుతాం

- కర్ణాటక సీఎం డీకే శివకుమార్
- ఆరు చరణాల జాతీయ గేయం పాడినం
- ఇది తెలియకుండా జరిగిపోయింది
- ఇక నుంచి రెండు చరణాలే పాడుతాం



2లో..

## 400 మందికిపైగా గల్లంతు



- నేపాల్‌లో వరద బీభత్సం
- 105 మంది భారతీయులు గల్లంతు
- భోటెకోషి నది ఉద్ధృతికి అతలాకుతలం
- విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ధ్వంసం

2లో..

**నేపాల్, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

టిబెన్ నుంచి వచ్చిన భారీ వరదలు నేపాల్‌లో పెను విలయాన్ని సృష్టించింది. భోటెకోషి నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది. ఇప్పటివరకు కనీసం 8 మృతదేహాలను గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది.

## నేపాల్ ప్రధానికి నరేంద్రమోడీ ఫోన్

- నేపాల్ వరదలతో బిహార్, యూపీలు హై అలర్ట్



2లో..

## ఏపీ పేలి 15 మంది శిశువులు సజీవదహనం

- పాకిస్థాన్ ప్రభుత్వాసుపత్రిలో అగ్నిప్రమాదం
- ఒకే ఒక్క శిశువు మాత్రమే ప్రాణాలతో
- ఘటనపై విచారణ కమిటీ వేసిన ప్రభుత్వం



2లో..

## నా కూతురి ప్లాన్ బి ఏంటో నాకేం తెలుసు?

- కాంగ్రెస్‌ను వీడేది లేదు..
- వివాదంతో నాకు సంబంధం లేదు
- సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు
- కొండా మురళి సంచలన కామెంట్లు

2లో..



## జెన్-జీతో భేటీ బాగుంది

- వారి ఆశయాలు, ఆకాంక్షలు అర్థం చేసుకోవాలి
- కోటంరెడ్డి 'జెన్‌జీ' ప్లాన్‌కు లోకేష్ ప్రశంసలు
- 'జెన్-జీ యువతతో మాటామంతి'
- 51 రోజుల పాటు 51 ప్రాంతాల్లో 20వేల మందితో భేటీ

2లో..



**అమరావతి, ఆగస్ట్ 26, అనంత జనశక్తి న్యూస్**

తన నియోజకవర్గంలో ఉన్న యువత ఆలోచనలు, ఆకాంక్షలు, సమస్యలు, భవిష్యత్ లక్ష్యాలను నేరుగా తెలుసుకునేందుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'జెన్‌జీ యువతతో మాటామంతి' కార్యక్రమానికి లోకేశ్ ప్రశంసలు లభించాయి. ప్రజాప్రతినిధులు యువతతో నిరంతరం మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని.. ఆ సూచనలకు అనుగుణంగా వారికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## సీఎం చోద్యం చూస్తున్నారు

- తెలంగాణ 2 అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నది
- మాజీ సీఎం వైఎస్ జగన్ విమర్శలు
- రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయి
- రైతుల్ని, ప్రజల్ని ఎలా ఆదుకుంటారు



**అమరావతి, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ . మొత్తం 28 జిల్లాలకు గాను 25 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని.. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు ఉందన్నారు.


5లో..

## ఢిల్లీ తరహా జెన్‌జీ ఉద్యమం తప్పదు

- సెక్షన్ 22ఏ జాబితా రద్దు చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ వార్నింగ్
- కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు
- తమ్ముడికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టాబెట్టారని సీఎం రేవంత్‌పై ఆరోపణలు

**హైదరాబాద్, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టాబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేపీహెచ్‌బీలో ఒక్క గజమైనా అమ్మినామా అని ప్రశ్నించారు. కానీ అదే కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో లక్ష ఎకరాల అసైన్డ్ భూములను అమ్మిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



5లో..

## ధరణితోనే అనేక భూ సమస్యలు

- సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వలేదు
- బీఆర్ఎస్ ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్
- ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చినం
- ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చాం

2లో..



# జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

**అమరావతి, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన సంజీవని ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో సంజీవని ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు చంద్రబాబు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్‌స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. 'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతోపాటు... డ్యాష్‌బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి.

విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్‌డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చంద్రబాబు చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేపాల్ ప్రధానికి నరేంద్రమోడీ ఫోన్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. ఒక్కసారిగా వచ్చిన మెరుపు వరద నేపాల్‌లోనే ఊర్లకు ఊర్లను కబలించింది. వందలాది మంది గల్లంతయ్యారు. 100కు పైగా భారతీయులు కూడా గల్లంతైనట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే, భారత్‌లో కూడా వరద ప్రభావం కనిపించే అవకాశం ఉంది. ముఖ్యంగా బీహార్, యూపీల్లో కోసి, గండక్ నదుల్లో ప్రవాహాలు పెరిగే ఛాన్స్ ఉంది. దీంతో ఆయా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి.

ఇదిలా ఉంటే, నేపాల్ వరద విధ్వంసంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షాకు, భారత ప్రధాని నరేంద్రమోడీ ఫోన్ చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల సంతాపం తెలిపారు. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా సహాయం, సహాయక మద్దతు అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భారత్ కాఠ్మాండులో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

నేపాల్‌లో వరదల వల్ల జరిగిన విధ్వంసం ఆందోళనకరంగా ఉందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గండక్, నారాయణి నదులలో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున, మహారాజ్‌గంజ్, కుషినగర్‌లోని స్థానిక యంత్రాంగాలను అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అధికారులను ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి పరిస్థితిపై చర్చించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు. బీహార్‌లోని ఆరు జిల్లాలకు పలు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపారు. కోసి, గండక్ నదీ పరివాహక ప్రాంతాలలో నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉన్నందున యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

# జెన్–జీతో భేటీ బాగుంది



(మొదటి పేజీ తరువాయి)


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. జెన్‌జీతో నేరుగా మాట్లాడి వారి ఆశయాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం మంచి చొరవ అని మంత్రి నారా లోకేష్ అభినందించారు. యువతతో ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన భావ వినిమయం కోసం తాను కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అయితే మంత్రి లోకేశ్ ఆలోచనల నుంచి తాను ప్రేరణ పొందినట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రానున్న 51 రోజుల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 51 ప్రాంతాల్లో 20 వేల మంది విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ జెన్‌జీ యువతతో మాటామంతి కార్యక్రమం ద్వారా నవతరం యువత ఆలోచనలు, వారి అంచనాలు, ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే తన లక్ష్యమని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

యువత ప్రస్తుతం రాజకీయ నాయకులను ప్రశ్నించే స్థాయికి ఎదిగిందని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి అనే తేడా లేకుండా ప్రజాప్రతినిధులను ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామని తెలిపారు. యువత దేశ భవిష్యత్‌పై ఆలోచిస్తోందని.. వారి అభిప్రాయాలను పాలనలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

'జెన్‌జీ యువతతో మాటామంతి'లో దేశ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించనున్నట్లు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కార్యక్రమాలపై యువతతో చర్చిస్తామని చెప్పారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, విద్య, సాంకేతిక రంగాల్లో అవకాశాలు వంటి అంశాలపై జెన్‌జీ అభిప్రాయాలను తెలుసుకోనున్నట్లు కోటంరెడ్డి తెలిపారు. సమావేశాల్లో బహిరంగంగా మాట్లాడేందుకు సంకోచించే విద్యార్థులు ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా తనతో తమ అభిప్రాయాలను పంచుకోవచ్చని కోటంరెడ్డి పేర్కొన్నారు.

# వందేమాతరం గేయంలో రెండు చరణాలనే పాడుతాం

**బెంగళూరు, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**



తమ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇకపై వందేమాతర గేయానికి సంబంధించి రెండు చరణాలనే ఆలపిస్తామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని అన్నారు. ఇటీవల రాష్ట్రంలో స్వాతంత్ర్య వేడుకల్లో ఆరు చరణాల జాతీయ గేయం పాడటంపై కూడా సీఎం డీకే శివకుమార్ స్పందించారు. తనకు తెలియకుండానే ఇది జరిగిపోయిందని అన్నారు. ఇకపై మాత్రం రెండు చరణాల జాతీయ గేయం ఉంటుందని స్పష్టం చేశారు. వందేమాతరం గేయానికి సంబంధించి రెండు చరణాలే పడాలన్న 1937 నాటి తీర్మానికి కట్టుబడి ఉండాలని గత వారం జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నిర్ణయించింది. జాతీయ గేయానికి సంబంధించి ఆరు చరణాలు పాడాలనే నిబంధనకు కేంద్రం చట్టరూపం ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. 'ఈ దేశంలో భిన్న రకాలు వర్గాలు ఉన్నాయి. కాబట్టి అందరితో కలిసి ముందుకు నడవాలని మేము విశ్వసిస్తాము. మా సిద్ధాంతం అదే' అని ముఖ్యమంత్రి అన్నారు. అందరినీ గౌరవించాలని చెప్పారు. సూర్యచంద్రులు, గాలి, నీటికి ఏ మతమూ లేదని వ్యాఖ్యనంచారు. హిందూ వర్సెస్ హిందుత్వవాదంపై జరుగుతున్న చర్చ విషయంలో సీఎం శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ధరణితోనే అనేక భూ సమస్యలు



**హైదరాబాద్, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

**ఆ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు**

ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.

**వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం..**

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

# భారత్ మాతాకీ జై.. మీరు చెప్పాల్సింది కానీయ్యండి

(మొదటి పేజీ తరువాయి)

పితృస్వామ్యాన్ని కూల్చివేయండనే ప్రతిపక్ష నేత వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీ పోస్టును రీషేర్ చేసిన మండీ ఎంపీ.. మహిళల హక్కులు, ప్రాతినిధ్యం విషయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్, షాబానో కేసు వంటి పలు కీలక అంశాల్లో కాంగ్రెస్ వైఖరిని ఆమె ఎత్తిచూపారు.

''కాస్త ఆగు బ్రో.... భారత్ మాతాకీ జై.. ఇక మీరు చెప్పాల్సింది కానీయ్యండి' అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మహిళల గురించి మాట్లాడిన రాహుల్.. ముందు దేశమాతను గౌరవించాలంటూ కంగనా పరోక్షంగా చెప్పారు. బాలీవుడ్ నటి రక్షా బంధన్ యాడ్ చుట్టూ మొదలైన ఈ వివాదం.. ఇప్పుడు రాజకీయాల వైపు మళ్లింది. కాంగ్రెస్, బీజేపీ సహా వివిధ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

కృతి సనన్ వస్త్రధారణ 'ఉద్దేశపూర్వకంగానే భయపెట్టేలా' ఉందని కంగనా వ్యాఖ్యానించగా.. మరికొందరు 'అసభ్యకరంగా' ఉందని అన్నారు. దీనిపై సనన్ స్పందిస్తూ.. ''మహిళలు ఎలాంటి బట్టలు వేసుకోవాలని చెప్పడం ఎప్పుడు ఆపుతాం?'' ప్రశ్నించారు. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ ''ఒక మహిళ ఏమి ధరిస్తుంది, ఏమి చేస్తుంది.. ఎక్కడికి వెళుతుంది అనేది ఆమె ఇష్టం.. తమ స్వేచ్ఛను వినియోగించుకుంటున్న మహిళలను ట్రోల్ చేయడం ఆపండి'' అని "smash the patriarchy" అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ అన్నారు.





విమర్శలతో యాడ్‌ను జీవా ఉపసంహరించుకుంది. మతపరమైన లేదా సాంస్కృతిక మనోభావాలను దెబ్బ తీయడం తమ ఉద్దేశం కాదని పేర్కొంది. బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్ కూడా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళలపై అవమానకరమైన వ్యాఖ్యలను ఖండించడంలో కాంగ్రెస్ నాయకుడు విఫలమైన అనేక సందర్భాలు ఉన్నాయని ఆమె ఉదహరించారు. ''కంగనా రనౌత్‌ను దూషించినప్పుడు.. అలాగే, ఒకసారి హేమా మాలినిపై అవమానకరమైన వ్యాఖ్య చేసినప్పుడు కూడా రాహుల్ గాంధీ మాట్లాడలేదు... రాష్ట్రపతి ముర్మును అధిర్ రంజన్ చౌదురి అగౌరవించారు.. పలువురు కాంగ్రెస్ నాయకులు మహిళలకు వ్యతిరేకంగా మాట్లాడారు.. అయినా రాహుల్ గాంధీ మౌనంగా ఉండిపోయారు.. ఇప్పుడు ఆయన పితృస్వామ్యాన్ని కూలదోయడం గురించి మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీని నేను అడగాలనుకుంటున్నాను.. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో ఒక్క మహిళా నాయకురాలు కూడా ఎందుకు లేదు? ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు వ్యతిరేకించారు? మరి మీరెందుకు మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్నారు?'' అని బన్సూరీ స్వరాజ్ ప్రశ్నించారు.

# నా కూతురి ప్లాన్ బి ఏంటో నాకేం తెలుసు?



**హైదరాబాద్, ఆగస్ట్ 26, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం చుట్టూ తిరుగుతున్న వివాదాలు, ప్రచారాలపై సీనియర్ నాయకుడు కొండా మురళి క్లారిటీ ఇచ్చారు. తమ కుటుంబం పార్టీ మారుతోందంటూ జరుగుతున్న ప్రచారాలను ఆయన ముమ్మాటికీ ఖండించారు. తాము కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఆయన, తమకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు.

**నా కూతురి ప్లాన్ బి ఏంటో నాకేం తెలుసు?**

తన కూతురు సుస్మిత వ్యాఖ్యలు, ఆమె చుట్టూ నడుస్తున్న వివాదంపై కొండా మురళి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సుస్మిత నా ఒక్కగానొక్క బిడ్డ. ఈ వివాదంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. అది పూర్తిగా నా కూతురి వ్యవహారం. అందువల్ల ఈ వివాదంపై నేను మాట్లాడను" అని తేల్చిచెప్పారు. తన కూతురి ఆలోచనలు, ప్లాన్‌లు తనకెలా తెలుస్తాయని ప్రశ్నిస్తూ.. "ఆమె ప్లాన్‌ఎ లో మాట్లాడింది, కానీ ప్లాన్ బి లో ఏం చేస్తుందో నాకేం తెలుసు? నా కూతురి ప్లాన్ నాకెలా తెలుస్తుంది?" అంటూ వ్యాఖ్యానించారు.

**పార్టీ మారేది లేదు.. భట్టితో భేటీపై స్పష్టత**

కాంగ్రెస్ పార్టీ మార్పుపై వస్తున్న వార్తలపై స్పందిస్తూ మీడియా తొందరపడాల్సిన అవసరం లేదని మురళి అన్నారు. "మేము పార్టీ మారడం లేదు, మీరేం ఆత్రుత పడాల్సిన అవసరం లేదు. ఈ విషయమై ఇవాళ్టికి వరంగల్ కూడా వెళ్లలేదు" అని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మాట్లాడుతూ, తాము కేవలం యోగక్షేమాలు మాట్లాడుకోవడానికే కలుసుకున్నామని, దానికి వేరే అర్థాలు తీయాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. కాగా, వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది. అలాగే సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని పీసీసీ నిర్ణయించింది. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు.

# 400 మందికిపైగా గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నేపాల్ టూరిజం బోర్డు చెప్పిన వివరాల ప్రకారం.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 384 మది పర్యాటకులు గల్లంతైనట్లు సమాచారం. ఇందులో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నారు. గల్లంతైన విదేశీయుల్లో 105 మంది భారతీయలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రసువా జిల్లాలో 26 మంది నేపాల్ పోలీస్ సిబ్బంది ఆచూకీ కూడా తెలియడం లేదని చెప్పారు. ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఏడుగురు సిబ్బంది కూగా గల్లంతైన వారిలో ఉన్నారు.

**విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ధ్వంసం..**

వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 20 మందిని రక్షించారు. రెస్క్యూ కోసం 15 హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. భారీ వరదల కారణంగా ఉత్తర నేపాల్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతాల్లోని రోడ్లు, విద్యుత్ మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదల కారణంగా జల విద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకారం రసువాగఢి, చిలిమే, త్రిశూలి 3A, త్రిశూలి 3B హబ్ 220 కేవీ





సబ్‌స్టేషన్, త్రిశూలి హైడ్రోపవర్ స్టేషన్, దేవీఘాట్ హైడ్రోపవర్ స్టేషన్ సహా కనీసం ఆరు ప్రధాన విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి.

**నేపాల్ ప్రధాని బాలెన్ షా అత్యవసర సమావేశం..**

నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా పరిస్థితిని సమీక్షించేందుకు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్య బృందాలు, స్కౌట్స్, రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. నేపాల్ పోలీసులు ప్రజలను నదీ పరివాహక ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. భోటెకోషి నదిలో టిబెట్ వైపు నుంచి భారీగా వరద నీరు ప్రవేశించడంతో త్రిశూలి నది పరివాహక ప్రాంతంలోని నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా తదితర జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారు గల్లంతు**

నేపాల్‌లో భోటేకోశి నది పెను విధ్వంసాన్ని సృష్టించింది. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న నేపాల్ జిల్లాల్లో ఒక్కసారిగా నది ఉప్పొంగటంతో అనేక గ్రామాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. వందలాది మంది గల్లంతయ్యారు. వీరిలో 100కు పైగా భారతీయులు ఉన్నట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. మరోవైపు, ఈ నది ప్రవాహం దిగువన ఉన్న భారత్‌లోని బీహార్, యూపీల్లోకి వచ్చే ప్రమదం ఉండటంతో ఆయా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కోసి, గండర్ నదుల ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, ఈ వరదల కాణంగా ఇప్పటి వరకు 19 మంది మృతి చెందగా, 400 మందికి పైగా కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారు గల్లంతైనట్లు తెలుస్తోంది. ఇందులో 133 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. గల్లంతైన వారిలో విదేశీయులు, నేపాలీ పౌరులు కూడా ఉన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడీ, నేపాల్ ప్రధాని బాలెన్ షాకు ఫోన్ చేసి వరదల్లో మరణించిన వారికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అవసరమైన సాయాన్ని అందిస్తామని ప్రధాని మోడీ నేపాల్‌కు హామీ ఇచ్చారు. . గల్లంతైన వారిలో విదేశీయులు, నేపాలీ పౌరులు కూడా ఉన్నారు.

# ఏసీ పేలి 15 మంది శిశువులు సజీవదహనం

**ఇస్లామాబాద్, ఆగస్ట్ 26, అనంతజనశక్తి న్యూస్**

పాకిస్థాన్‌లోని రాజధాని నగరం ఇస్లామాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఒక ప్రముఖ ప్రభుత్వ వైద్య విభాగానికి చెందిన ఆసుపత్రిలో ఒక్కసారిగా ఏసీ పేలిపోగా.. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా పదిహేను మంది నవజాత శిశువులు సజీవ దహనం అయ్యారు. బుధవారం నాడు చోటుచేసుకున్న ఈ దారుణ దుర్ఘటనతో యావత్ దేశం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

**ఏసీ పేలడం వల్లే ప్రమాదం..!**

ఇస్లామాబాద్‌లోని ప్రసిద్ధ 'పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (పీఐఎమ్ఎస్) ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ప్రమాదం జరిగింది. ఆసుపత్రి భవనంలోని మూడో అంతస్తులో ఉన్న గైనకాలజీ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ముఖ్యంగా ఆ గదిలో అమర్చిన ఎయిర్ కండిషనర్ కంప్రెసర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో భారీ శబ్దంతో పాటు పెద్ద ఎతతున పొగలు, మంటలు వ్యాపించాయి. గదంతా కాలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి.

**ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్క శిశువు..!**

మూడో అంతస్తులోని వార్డులోకి ప్రవేశించేందుకు వీలుగా అద్దాల కిటికీలను పగలగొట్టి, అత్యవసర మార్గాల ద్వారా లోపలికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మంటలను ఆర్పడంలో వారు సఫలమైనప్పటికీ.. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. వార్డులో ఉన్న పదిహేను మంది పసికందులు తీవ్రంగా కాలిపోయి ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. అయితే ఆ వార్డులో ఉన్న పిల్లలలో కేవలం ఒకే ఒక్క నవజాత శిశువు మాత్రమే సురక్షితంగా ప్రాణాలతో బయటపడటం గమనార్హం.


**విచారణకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

పుట్టిన వెంటనే చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. ఈ హృదయవిదారక ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను, భద్రతా లోపాలను వెలికి తీసేందుకు గాను ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రి వర్గాల నిర్లక్ష్యం లేదా సాంకేతిక లోపాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

# "2047 వరకు ఓపిక పట్టండి.. అంతా బాగవుతుంది"

**- గురుగ్రామ్ ముంపుపై హర్యానా ఎంపీ సంచలన వ్యాఖ్యలు**





మిలీనియం సిటీగా పేరుగాంచిన గురుగ్రామ్‌ను చిన్నపాటి వర్షం ముంచెత్తి నగర వ్యవస్థలన్నింటినీ స్తంభింపజేయడంపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సర్కారు.. పాఠశాల బస్సులను వరద నీళ్లలో వెళ్లకుండా నిషేధించగా జనాలు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో.. పాలక పక్షానికి చెందిన ఎంపీ ధరంబీర్ సింగ్ చేసిన వ్యాఖ్యలు మరింత గొడవకు కారణం అయ్యాయి. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపించి, గంటల తరబడి స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు నీటిలో చిక్కుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఊరటనిచ్చే మాటలు చెప్పాల్సింది పోయి.. 2047 వరకు ఆగండి, ఆలోపు సమస్యలు అన్నీ పరిష్కారం అవుతాయని చెప్పారు.

**2047 మాస్టర్ ప్లాన్‌తోనే అన్ని సమస్యలకు చెక్..!**

నగరంలో వర్షపు నీటి నిల్వలు, నిరంతర ట్రాఫిక్ జామ్‌ల సమస్య ఎప్పుడు తీరుతుందని ప్రశ్నించగా.. హర్యానాలోని భివానీమహేందర్‌గఢ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వినూత్నంగా స్పందించారు. 2047 నాటికి సిద్ధమయ్యే కొత్త మాస్టర్ ప్లాన్ ద్వారా భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని, అప్పటి వరకు వేచి చూడక తప్పదని తేల్చి చెప్పారు. అప్పటికల్లా గురుగ్రామ్ నగర సమస్యలన్నీ సంపూర్ణంగా పరిష్కారం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం తప్పు లేదంటూ వింత సమర్థనలు**

ఈ ఘోర వ్యవస్థాపక వైఫల్యానికి ప్రభుత్వం లేదా స్థానిక యంత్రాంగం ఏమాత్రం బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఎంపీ స్పష్టం చేశారు. యంత్రాంగం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, ట్రాఫిక్ స్తంభించకుండా తన శాయశక్తులా కష్ట పడుతోందని.. అయితే ప్రతీది చేయలేమని వ్యాఖ్యానించారు. గురుగ్రామ్‌ను 60 ఏళ్ల క్రితం డిజైన్ చేసిన నాటి ప్లానర్లు నగరంలో ఈ స్థాయిలో జనాభా, వాహనాలు, గృహాలు పెరుగుతాయని ఊహించలేకపోవడమే అసలు తప్పిదమని పేర్కొన్నారు. తీవ్రమైన ఆక్రమణల వల్ల పాత డ్రైనేజీ కాలువలు ఇరుకుగా మారిపోయాయని.. ఇప్పుడు వాటిని విస్తరించే అవకాశం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో వాతావరణ మార్పుల కారణంగా అకస్మాత్తుగా తీవ్రమైన వర్షాలు కురుస్తున్నాయని.. ఆ నీరు బయటకు పోవడానికి కొంత సమయం పడుతుందే తప్ప దానిని ప్రభుత్వ వైఫల్యంగా చూడలేమని అభిప్రాయపడ్డారు.

**కాంగ్రెస్ హయాం నాటి విధానాలే కారణమన్న మరో ఎంపీ**

మరోవైపు గురుగ్రామ్ ఎంపీ రావు ఇంద్రజిత్ సింగ్ సైతం ఇదే అంశంపై స్పందిస్తూ.. విపక్ష కాంగ్రెస్ హయాంలో చేపట్టిన విధానాలే నేటి దుస్థితికి మూల కారణమని ఆరోపించారు. గతంలో కొండల నుంచి యమునా నదికి నీటిని తీసుకెళ్లే సాంప్రదాయ డ్రైనేజీ మార్గాలను కప్పివేసి నిర్మాణాలు చేపట్టారని.. కాంగ్రెస్ హయాంలో చేసిన ఆ పొరపాట్లను తాము ఇప్పటికీ అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం తాము చేపడుతున్న చర్యలు తాత్కాలిక ఊరటనిచ్చే బ్యాండ్ ఎయిడ్' పరిష్కారాలు మాత్రమేనని ఆయన అంగీకరించారు. గురుగ్రామ్ నగరంలో శాశ్వత పరిష్కారం కోసం మెట్రో సొరంగాల తరహాలోనే పాత కాలువల మార్గాల్లో భూగర్భ టన్నెళ్లు నిర్మించడమే ఏకైక మార్గమని.. అందుకు సంబంధించి నిధులు సమీకరించి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన తెలిపారు. మొత్తం మీద నగరం మునిగిపోతుంటే.. నేతలు పాత ప్రభుత్వాలు, వాతావరణంపై నెపం నెట్టడం పట్ల తీవ్రస్థాయిలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. హర్యానా ఎంపీ ధరంబీర్ సింగ్ చేసిన కామెంట్లు గురుగ్రామ్ ప్రజల్లోలాగే మీకు కూడా కోపం తెప్పించాయా? మీ భావాలను కామెంట్ ద్వారా తెలియజేయండి.

# ఇంట్లోంచి రూ.50 లక్షలు ఎత్తుకెళ్లి.. ప్రియురాలికి ఐఫోన్, విలాసవంతమైన హోటళ్లలో జల్సాలు.. కానీ చివరకు?



ప్రియురాలికి ఖరీదైన గిఫ్టులు ఇచ్చి సర్‌ప్రైజ్ చేయాలని, ఆమెను తనకు నచ్చిన చోటుకు తీసుకెళ్తూ ఫుల్లుగా ఎంజాయ్ చేయాలని చాలా మంది అబ్బాయిలే కలలు కంటారు. ఆర్థిక స్థోమత బాలేక కొందరు, ప్రియురాలు లేక మరికొందరు ఇలాంటి పనులు చేయడాన్ని వదులుకుంటే.. మనం ఇప్పుడు చూడబోయే వ్యక్తి మాత్రం ఎవరూ ఊహించని పని చేశాడు. అతడికి ప్రియురాలు ఉంది కానీ చేతిలో డబ్బులే లేవు. దీంతో సొంతింట్లోనే దొంగతనానికి పాల్పడ్డాడు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.50 లక్షలు దోచేశాడు. ఆపై ఏమీ తెలియనట్లుగా ఇంట్లోంచి వెళ్లి ఆ డబ్బుల్లోంచే ప్రియురాలికి ఐఫోన్ ఇప్పించాడు. ఆపై లగ్జరీ హోటళ్లకు తీసుకెళ్తూ.. ఫుల్లుగా ఎంజాయ్ చేశాడు. ఎలాగోలా ఈ విషయం తెలుసుకున్న తండ్రి.. నేరుగా హోటల్‌కు వెళ్లి మరీ కుమారుడిని పోలీసులకు పట్టించాడు. ఈ ఘటన ఎక్కడ జరిగింది, కొడుకే దొంగ అని తండ్రి ఎలా తెలుసుకున్నాడో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.

అసలేం జరిగిందంటే..?

అస్సాంలోని జోర్హాట్‌కు చెందిన వ్యాపారవేత్త కుటుంబం ఆగస్టు 11వ తేదీన పనిమీద బయటకు వెళ్లారు. అయితే ఆ సమయంలోనే వారి ఇంట్లో దొంగతనం జరిగింది. వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగింది. అయితే వీరు తిరిగొచ్చిన తర్వాత దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించారు. ముఖ్యంగా ఎవరో రూ.50 లక్షలు చోరీ చేయగా.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే ఇల్లంతా పరిశీలించగా.. గదిలోకి వచ్చి, నేరుగా లాకర్ తెరిచినట్లు ఆధారాలు కనిపించగా.. ఇదంతా ఇంట్లో వాళ్లే చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం చెప్పగానే వ్యాపారవేత్తకు కూడా అనుమానం వచ్చింది. వెంటనే తాము వెళ్లేటప్పుడు తమ 25 ఏళ్ల కుమారుడు యష్ ధనుకా అగర్వాల్ మాత్రమే ఇంట్లో ఉన్నట్లు చెప్పాడు.

అయితే అతడికి ఇంట్లో డబ్బులు ఎక్కడుంటాయనే విషయం కూడా తెలుసని, అతడే తీసి ఉంటాడని తండ్రి అనుమానం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా దొంగతనం జరిగిన తర్వాత నుంచి అతడు ఇంట్లో లేకపోవడం, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో.. అతడిని దొంగగా భావించారు. దీంతో అతడి మొబైల్ సిగ్నల్ ఆధారంగా అతడు ఎక్కడ ఉన్నాడో గుర్తించారు. ముఖ్యంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో యష్ ధనుకా అగర్వాల్ ఉన్నట్లు గుర్తించగా.. తండ్రి నేనే వెళ్లి తీసుకొస్తానని చెప్పాడు. అలా యష్ తండ్రి అహ్మదాబాద్ వెళ్లేసరికి.. యష్ తన ప్రియురాలు పుబాలి దత్తాతో కలిసి ఓ విలాసవంతమైన హోటల్లో హాయిగా గడుపుతున్నాడు.

రూ.1.5 లక్షలతో ఐఫోన్ గిఫ్ట్, లగ్జరీ హోటళ్లలో బస

అది చూసిన తండ్రి.. వెంటనే కుమారుడి వద్దకు వెళ్లి డబ్బులు దొంగిలించి ఏం చేశావని నిలదీశాడు. నువ్వు ఇంటికి పదా అంటూ కొడుకును అస్సాం తీసుకువచ్చి వెంటనే పోలీసులకు అప్పజెప్పాడు. ఈక్రమంలోనే పోలీసులు తమదైన స్టైల్లో విచారించగా.. యష్ అగర్వాల్ తన తప్పును ఒప్పుకున్నాడు. తానే ఇంట్లోంచి రూ.50 లక్షలు దొంగిలించానని.. అందులోంచి రూ.5 లక్షలు ఖర్చు పెట్టానని వివరించాడు. అందులో ప్రియురాలికి రూ.1.5 లక్షలతో ఐఫోన్ కొనిచ్చానని అలాగే నగదు కూడా ఇచ్చినట్లు అంగీకరించాడు. ఇది మాత్రమే కాకుండా పలు హోటళ్లు, రిసార్టుల్లో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించినట్లు పేర్కొన్నాడు. అంతేకాకుండా ఈ దొంగతనం ప్లాన్ తనది కాదనే షాకింగ్ విషయాన్ని కూడా వెల్లడించాడు.

తన స్నేహితులు జితు సోమాని, రోహిత్ ప్రసాద్‌లే ఈ దొంగతనానికి పథకం రచించారని, వారి మాటలు వినే తాను తీవ్ర తప్పిదం చేశానని యష్ అగర్వాల్ పోలీసులకు తెలిపాడు. ఇంట్లో ఉన్న లాకర్ తెరుచుకోకపోవడంతో.. తాళాలు తయారు చేసే వ్యక్తి సాయంతో లాకర్ పగులగొట్టి రూ.50 విలువ చేసే డబ్బులు, నగలు ఎత్తుకెళ్లినట్లు స్పష్టం చేశాడు. అయితే ఈ కేసులో సదరు ప్రియురాలిని నిందితురాలిగా చేర్చకపోయినప్పటికీ.. ఆమెను కూడా విచారించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పరారీలో ఉన్న మిగిలిన నిందితులు జితు, రోహిత్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. జోర్హాట్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారత్ న్యాయ సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, యష్‌ను న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి రిమాండ్ విధించింది.

సొంత ఇంట్లోనే దొంగతనం చేసి ప్రియురాలికి ఖరీదైన బహుమతులు, లగ్జరీ లైఫ్ కల్పించడం సరైన నిర్ణయమే అని మీరు భావిస్తున్నారా? దయచేసి కామెంట్లలో మీ అభిప్రాయాలను తెలియజేయండి.

# "ఆగస్టు 25 బిగ్ రివీల్" అంటూ.. రూ.8.5 కోట్లు వసూలు చేసి చేతులెత్తేసిన సోషల్ మీడియా క్రియేటర్!



సోషల్ మీడియా వేదికగా ఏదో కొత్త విషయాన్ని లేదా పెద్ద రహస్యాన్ని బయటపెడతామంటూ ఆశలు రేపి, నెటిజన్లను బురిడీ కొట్టించిన ఒక ఘోరమైన ఆన్‌లైన్ మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఏదో ఒక గొప్ప విషయాన్ని వెల్లడిస్తారనే ఉత్సుకతతో వేలాది మంది నెటిజన్లు పెద్ద ఎత్తున సొమ్ము చెల్లించి చివరికి తీవ్ర నిరాశకు గురయ్యారు. సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారమైన 'ఆగస్టు 25' బిగ్ రివీల్ వెనుక ఏకంగా రూ.8.5 కోట్ల మేర భారీ ఆర్థిక అక్రమం చోటుచేసుకుందనే ఆరోపణలు ఇప్పుడు అంతర్జాలంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

**హైప్ క్రియేట్ చేసి టెలిగ్రామ్ లింక్‌తో వల**

'2026 ఆగస్టు 25' అనే పేరుతో క్రియేట్ చేసిన ఒక సోషల్ మీడియా ఖాతాను ఎవరో ఓ వ్యక్తి ఇటీవలే ప్రారంభం చేశాడు. అయితే సదరు ఖాతాదారుడు గత కొన్ని రోజులుగా వరుసగా రీల్స్ పోస్ట్ చేస్తూ.. ఆగస్టు 25వ తేదీన తాను ఒక అతి పెద్ద రహస్యాన్ని బయట పెట్టబోతున్నట్లు ప్రచారం చేశాడు. ఆ వీడియోను చూస్తే ఎవ్వరూ పశ్చాత్తాప పడరని, తప్పకుండా తన ఛానెల్‌ను ఫాలో అవ్వాలని నెటిజన్లను కోరాడు. ఈ రీల్స్‌కు సోషల్ మీడియాలో ఊహించని స్థాయిలో మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. నెటిజన్లలో తీవ్ర ఆసక్తి పెరిగిన తర్వాత.. ఇన్‌స్టాగ్రామ్‌లో పెడితే ఈ వీడియో డిలీట్ అయ్యే అవకాశం ఉందనే సాకుతో ఒక టెలిగ్రామ్ ఛానెల్ లింక్‌ను షేర్ చేసి, అందరినీ అక్కడ ఫాలో అవ్వాల్సిందిగా సదరు క్రియేటర్ సూచించాడు.


రూ.500 వసూలు.. ఏకంగా రూ.8.5 కోట్ల కలెక్షన్!


ఆ క్రియేటర్ మాటలు నమ్మి టెలిగ్రామ్ లింక్‌ను ఫాలో అయిన వినియోగదారులకు.. ఇక్కడే ఓ షాక్ తగిలింది. ప్రచారం చేసిన సంచలన వీడియోను చూడాలంటే ఒక్కొక్కరు రూ.500 చొప్పున చెల్లించాలని షరతు విధించాడు. ఏదో పెద్ద విషయాన్ని చూడవచ్చనే ఆత్రుతతో దాదాపు 1 లక్షా 66 వేల మంది వినియోగదారులు ఆ మొత్తాన్ని డిపాజిట్ చేసినట్లు సోషల్ మీడియా వేదికగా చెప్పుకొస్తున్నారు. ఈ లెక్కన సదరు క్రియేటర్ నెటిజన్ల నుంచి ఏకంగా రూ.8.5 కోట్ల మేర నగదు సేకరించాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**చివరికి ఇచ్చిన వీడియో చూసి మైండ్ బ్లాక్..!**

తీరా డబ్బులు చెల్లించిన తర్వాత సదరు క్రియేటర్ అసలు వీడియోను విడుదల చేశాడు. అయితే గత కొన్ని రోజులుగా భారీ ఎత్తున ప్రచారం చేసిన ఆ 'బిగ్ రివీల్' వీడియో స్థానంలో ఒక సాధారణ 'మోటివేషనల్ వీడియో'ను పోస్ట్ చేయడంతో డబ్బులు చెల్లించిన వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పెద్ద ఎత్తున ఆశలు రేపి.. రూ.500 చొప్పున కోట్లు దండుకుని, చివరికి మోటివేషనల్ వీడియో ఇవ్వడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఉదంతంపై సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చ నడుస్తోంది. వేలాది మంది వినియోగదారులు దీనిని ఒక పథకం ప్రకారం చేసిన రూ.8.5 కోట్ల స్కామ్‌గా అభివర్ణిస్తూ వీడియోలు, పోస్టులు పెడుతున్నారు.

# యూపీని ముంచెత్తిన వర్షాలు.. వరదలో కొట్టుకుపోయిన ఏనుగులు





**ఉత్తర్‌ప్రదేశ్ లో భారీ వర్షాలతో నదులు పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం ఉదయం బహ్రాయిచ్‌లోని కౌడియాల నది ఉద్ధృతికి ఐదు ఏనుగులు వరదలో కొట్టుకుపోయాయి. ఏనుగుల గుంపు గిర్జాపురి బ్యారేజ్ వైపు కొట్టుకుపోతోందని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కతర్నియాఘాట్ వన్యప్రాణి విభాగం అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నీటిపారుదల శాఖ అధికారులు బ్యారేజ్ గేట్లను మూసివేసి.. ప్రవాహ తీవ్రత తగ్గిన అనంతరం ఐదు ఏనుగులను రక్షించారు. అనంతరం సురక్షిత ప్రాంతానికి ఏనుగులను మళ్లించారు. వాటిలో రెండు ఏనుగు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.**

**33 జిల్లాల్లో భారీ వర్షాలు..**


**రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 75 జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఏడు జిల్లాల్లో అతి భారీ వర్షాలు 33 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా. మంగళవారం ఉదయం నుంచి లఖ్‌నవూ, వారణాసి, అయోధ్య, ఝాన్సీ సహా పలు నగరాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. 19 జిల్లాలకు వాతావరణ శాఖ వరద హెచ్చరికలు, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.**

## డ్రగ్స్ కట్టడికి మహిళల రాత్రి గస్తీ



విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని మాదకద్రవ్యాల మహమ్మారి ఇప్పుడు గ్రామాలకూ విస్తరిస్తోంది. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్ సమీప ఓల్డ్ ముస్సోరి రోడ్డులో గల ధానీ గ్రామ మహిళలు తమ పిల్లలను ఈ మత్తు బారినపడకుండా కాపాడుకోడానికి స్వయంగా రంగంలోకి దిగారు. సాయంత్రం అయిదింటి నుంచి అర్ధరాత్రి వరకు చేతుల్లో కర్రలు, సెల్‌ఫోన్లతో గ్రామ వీధుల్లో తిరుగుతూ మహిళలు కాపలా కాస్తున్నారు. డ్రగ్స్ విక్రయించేవారికి, రాత్రిళ్లు మత్తు పదార్థాల కోసం ఊళ్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తులకు దడ పుట్టిస్తున్నారు. దాదాపు 350 కుటుంబాలున్న ధానీ గ్రామంలో గత ఏడేళ్లుగా డ్రగ్స్ అమ్మకాలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. బయటి ప్రాంతాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు, విద్యార్థులు రాత్రి వేళల్లో బైకులు, కార్లపై ఇక్కడికి వచ్చి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో విసుగుచెందిన 30 మందికి పైగా మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడి, గ్రామంలో డ్రగ్స్ కట్టడి బాధ్యతను తీసుకున్నారు.

## 6 పదుల జెన్ జీ!





టెక్నాలజీతో ఓ ఆటాడాలనుకున్నా.. టెక్ సావీగా పేరు పొందాలన్నా యూత్‌కే సాధ్యం అనే మాట పక్కన పెట్టండిక! అరవై ఐదేళ్ల రవినందన్ సహాయ్ పోటీకి వచ్చేశారు. ఆయనది బిహార్‌లోని పట్నా. చదివింది ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్. కానీ సొంతంగా ఓ యాప్ డిజైన్ చేసేశారు. దాని సాయంతో చోరీకి గురైన ఫోన్‌ను సులువుగా కనుక్కోవచ్చని చెబుతున్నారు. రవి కుమారుడు, కుమార్తె కంప్యూటర్ ఇంజినీర్లు. ఇలాంటి ఓ యాప్‌ను తయారు చేయమని ఎంత అడిగినా పోజు కొట్టేవాళ్లు. దాంతో తానే పూనుకున్నారు. గూగుల్‌ని గాలించి, యూట్యూబ్‌కి శిష్యరికం చేసి క్లౌడ్ సాంకేతికతలో మెలకువలు నేర్చుకున్నారు. 3 నెలల్లో 'గెట్ యువర్ లాస్ట్ ఫోన్' అనే యాప్‌ను రూపొందించారు. 'ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేటప్పుడే ప్రత్యామ్నాయ నంబర్, మెయిల్ అడ్రస్ ఇవ్వాలి. చోరీ చేసినవారు ఎప్పుడు ఫోన్ అన్‌లాక్ చేయడానికి ప్రయత్నించినా వారి ఫొటో, సదరు లొకేషన్ ప్రత్యామ్నాయ మెయిల్, నంబర్‌కు వచ్చేస్తాయి. జెన్ జీ కోసమే దీన్ని తయారు చేశా' అని రవి వివరించారు.

## తెలంగాణ, బిహార్ కులగణనను నమూనాగా తీసుకోండి



జన గణనలో భాగంగా చేపడుతున్న కుల గణనకు తెలంగాణ, బిహార్‌లలో చేపట్టిన గణనను నమూనాగా తీసుకోవాలని పార్లమెంటు ఉభయ సభల ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండు చేశారు. కులాల లెక్కలు సరిగా సేకరించినప్పుడే వారి సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. కుల గణనపై వారు ప్రధాని మోదీకి సంయుక్తంగా లేఖ రాశారు. లక్షల కులాలు పుట్టుకొస్తాయ్: "మీ ప్రభుత్వం కులం వివరాలను వెల్లడించడానికి ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది. ఇందులో జనాభా లెక్కల సేకరణ సమయంలో ప్రజలు ఏం కులం పేరు చెబితే అదే నమోదు చేస్తారు. భారత్‌లో ఒకే కులాన్ని విభిన్న ప్రాంతాల్లో విభిన్న పేర్లు, ఉప కులాలు, భాషల ద్వారా గుర్తిస్తారు. ఒకే కులానికి చెందిన వ్యక్తులు జన గణనలో వేర్వేరు పేర్లతో నమోదైతే ఒకే కులం వందల పేర్లతో విడిపోతుంది. దానివల్ల దేశవ్యాప్తంగా లక్షల కులాలు పుట్టుకొస్తాయి. దానివల్ల కుల గణన ద్వారా సేకరించిన లెక్కలన్నీ పూర్తి నిరుపయోగంగా మారతాయి. వెనుకబడిన, అత్యంత బలహీన, విధివంచిత వర్గాలకు నష్టం జరుగుతుంది. ఈ జన గణనలో వెనుకబడిన వర్గాలు అన్న పదాన్ని చేర్చనందున ఓబీసీలు ఎంత మంది ఉన్నారన్న విషయం వెలుగులోకి రాకుండాపోయే అవకాశముంది. ఈ సమస్యకు సులభమైన పరిష్కారం చూపడానికి జన గణనలో ప్రతి కులానికీ ఒక డ్రాప్ డౌన్ సూచీ తయారు చేయండి. తెలంగాణ, బిహార్‌లలో నిర్వహించిన కుల గణనలో ఈ విధానాన్ని అనుసరించారు. మీ పరిశీలన కోసం రెండు రాష్ట్రాల కుల గణన నివేదికలను ఈ లేఖతో కలిపి పంపుతున్నాం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. ప్రస్తుతం ప్రకటించిన ప్రశ్నావళిని రద్దు చేసి మళ్లీ రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో చర్చించి కొత్త ప్రశ్నావళిని తయారు చేయాలి" అని తమ లేఖలో ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు.

## బ్రో.. ఆగు: రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కంగనా కౌంటర్



బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రముఖ నటి కృతి సనన్ నటించిన రక్షా బంధన్ యాడ్‌పై వివాదం నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కంగన తనదైన శైలిలో స్పందించారు. పితృస్వామ్యాన్ని కూల్చివేయండనే రాహుల్ వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా బదులిచ్చారు. ఇన్‌స్టాలో భాజపా పోస్టును కంగనా రీషేర్ చేశారు. మహిళల హక్కులు, ప్రాతినిధ్యం విషయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తూ... మహిళల రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్, షాబానో కేసు వంటి పలు కీలక అంశాలలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలను ఎత్తిచూపారు. 'బ్రో.. కాస్త ఆగు.. భారత్ మాతాకీ జై.. ఇక మీరు చెప్పాల్సింది మొదలుపెట్టండి' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మహిళల గురించి మాట్లాడిన రాహుల్ దేశమాతను ముందు గౌరవించాలంటూ పరోక్షంగా చెప్పారు. రక్షా బంధన్ పండగ ప్రకటన చుట్టూ మొదలైన ఈ వివాదం, ఇప్పుడు బాలీవుడ్ నుంచి రాజకీయాల వైపు మళ్లింది. ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.



# ముందే మేల్కోవాలి!

ఏటా వర్షా కాలంలో అస్సాం విషాదకర దృశ్యాలతో వార్తల్లో నిలుస్తుంది. ఉప్పొంగే నదులు, మునిగిన గ్రామాలు, వరద బాధితుల కష్టాలు, రక్షక బృందాల ఇక్కట్లు పరిపాటిగా మారాయి. ఈసారి పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ ప్రకృతి బీభత్సం దేశంలోని మిగతా ప్రాంతాలకూ తీవ్ర హెచ్చరికే. వరదలు, తుపాన్లను సహాయక చర్యలు, నష్టపరిహారాలతో సరిపెట్టేసే పరిస్థితులుగానే చూస్తామా లేదా ఏడాది పొడవునా అప్రమత్తతతో, సమర్థ నిర్వహణ అవసరమయ్యే వ్యవస్థాగత సవాలుగా గుర్తిస్తామా అన్నదే కీలక ప్రశ్న!

ఈసారి అస్సాం వరదల్లో 101 మంది మరణించారు. దాదాపు 11వేల హెక్టార్ల సాగుభూమి నీట మునిగింది. అస్సాంలో సుమారు 40శాతం భూభాగం తీవ్రమైన వరద ముప్పునకు గురవుతోంది. 1950 నుంచి నదీ ప్రవాహ మార్గం మారుతున్నందున సుమారు 4.27 లక్షల హెక్టార్ల భూమి కోతకు గురైంది. 2019లో 1.6లక్షల హెక్టార్లకు పైగా సాగు భూమి నీట మునిగింది. 2024 వరదలు సుమారు 25 లక్షల మందిని నిర్వాసితులుగా మార్చాయి. అడవుల నరికివేత, ప్రణాళిక లేని పట్టణీకరణ, నదీగర్భంలో ఇసుక తవ్వకాలు అస్సాంలో వరద ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఇది ఇతర ప్రాంతాలకూ హెచ్చరిక సంకేతంగా భావించాలి. ఈ ప్రకృతి విపత్తులకు చాలావరకు వాతావరణ మార్పులే కారణం. నైరుతి రుతుపవనాల కాలంలో గరిష్ఠ వర్షపాతం జులై నుంచి ఆగస్టుకు మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. రుతుపవనాల అనంతర వర్షపాతం పెరుగుతోంది. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం కురుస్తుండటం తీవ్ర నష్టాలకు కారణమవుతోంది. 100 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం కురిసే రోజులు పెరుగుతున్నాయి. వర్షపాతంతోపాటు నేలలోని తేమ, ఉపనదుల ప్రవాహాలు, కరకట్టలు, భూదుర్వినియోగం అన్నీ కలిసి విపత్కర పరిస్థితులకు దారితీస్తున్నాయి. వాతావరణం వేడెక్కడం వల్ల ఈ శతాబ్దంలో హిమాలయాల్లోని హిమానీనదాలు గణనీయంగా కరిగిపోతాయి. సింధు, గంగా, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థలలో విపరీతమైన మార్పులు సంభవిస్తాయి.

**సమన్వయం అవసరం**

పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పూర్తిగా వాతావరణ మార్పులనే కారణంగా చూపడమూ సరికాదు. పర్యావరణ మార్పులు ప్రమాద తీవ్రతను పెంచితే, దాని ప్రభావాన్ని అధిగమించడానికి తగిన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలి. తెలంగాణలోని భద్రాచలం నుంచి ఏపీలోని పోలవరం, ధవళేశ్వరం డెల్టాలోకి గోదావరి ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల వర్షపాతం, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల నదీ ప్రవాహ మట్టాలను నిర్దేశిస్తాయి. కరకట్టల భద్రత, విపత్తు నిర్వహణ మాత్రం వేర్వేరు రాష్ట్రాలు, విభాగాల వారీగా విడివిడిగా కొనసాగుతున్నాయి. వరద ఉద్ధృతికి లోనయ్యే గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎగువ నుంచి దిగువ రాష్ట్రాల వరకు పకడ్బందీ సమన్వయం అవసరం. విజయవాడలో 2024లో సంభవించిన వరదలు కేవలం కృష్ణా నది పొంగడం వల్ల వచ్చినవి కావు. విపరీతమైన వర్షపాతం, బుడమేరులో భారీ ప్రవాహాలు, డ్రైనేజీ మౌలిక సదుపాయాలకు గండ్లు, వరద నీటిని వేగంగా తరలించలేకపోవడం వంటివన్నీ కలిసి విజయవాడను దెబ్బతీశాయి. హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురై వర్షా కాలంలో ముంపును తెచ్చిపెడుతున్నాయి. భారతీయ నగరాలు వేగంగా విస్తరిస్తున్నా డ్రైనేజీ వ్యవస్థలు కేవలం కొన్ని గంటల కుండపోతను కూడా తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నాయి. వరద ముప్పును నివారించాలంటే నదులు, కాలువలు, చిత్తడి నేలలు, చెరువులు, వరద మైదానాలు, రోడ్లు, పంపింగ్ వ్యవస్థలను ఒకే జలవ్యవస్థగా పరిగణించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెద్ద డ్రైనేజీలను నిర్మించడమే కాకుండా, రక్షిత డ్రైనేజీ కారిడార్లు, చిత్తడి నేలల పునరుద్ధరణ, వరద మైదానాల గుర్తింపు, కఠినమైన భూవినియోగ నిబంధనలను చేపట్టాలి. వరదలు, తుపాను నష్టాలను నివారించే వసతులపై ముందస్తుగా పెట్టుబడులు పెట్టడంకంటే, వరదలతో మునిగాక సహాయ చర్యలపై ఖర్చు పెట్టడానికే మనదేశం పరిమితమవుతోంది. ప్రపంచబ్యాంకు అంచనా ప్రకారం విపత్తు వ్యయంలో 70 శాతానికి పైగా తక్షణ సహాయం, స్వల్పకాలిక చర్యలకే ఖర్చవుతోంది. కరకట్టల తనిఖీలు, డ్రైనేజీ మాస్టర్‌ప్లాన్‌లు, చిత్తడి నేలల పునరుద్ధరణ వంటి ముందస్తు చర్యలకు ప్రాధాన్యం లభించడం లేదు. ముప్పును నివారించడానికి ముందుగా ఖర్చు చేసే ప్రతి రూపాయి భవిష్యత్తులో పునరావృతమయ్యే సహాయ, పునర్నిర్మాణ ఖర్చులను నివారించగలదు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ వంటివి తీరని నష్టం కలిగిస్తాయి. ప్రతి రుతుపవనానికి ముందు మౌలిక సదుపాయాల్లో బలహీనతలను గుర్తించి, లోపాలను సరిదిద్ది, అందుకైన ఖర్చును బహిరంగంగా ప్రకటించడం అవసరం.

వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడినప్పుడు జాతీయ విపత్తు నిభాయింపు దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) తక్షణం రంగంలోకి దిగి సమర్థంగా సేవలు అందిస్తోంది. అయితే ఇది డ్రైనేజీల్లో పూడిక తీయలేదు. వరద మైదానాల ఆక్రమణలను నియంత్రించలేదు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల బాధ్యతలు. తెలంగాణలో ఇప్పుడు అధికారికంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఏర్పడింది. ఏపీఎస్‌డీఎంఏకు తుపాన్ల విషయంలో అనుభవం ఉంది. కానీ ఇవి పరిపాలనా సంస్థలుగానే మిగిలిపోయాయి. అధిక ముప్పు ఉన్న రాష్ట్రాలకు జలమంత్రులు, నదీ ఇంజినీర్లు, వాతావరణ శాస్త్రవేత్తలు, పట్టణ ప్లానర్లతో కూడిన శాశ్వత నిభాయింపు వ్యవస్థ అవసరం. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడమే కాకుండా, అభివృద్ధి పేరిట ముప్పునకు దారితీసే నిర్ణయాలను సవాలు చేసే అధికారం వీరికి ఉండాలి. ప్రతి వరద ప్రభావిత గ్రామం, వార్డుకు జిల్లా కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానమైన సుశిక్షిత టాస్క్‌ఫోర్స్‌లు కావాలి. నదీ పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల మధ్య పరస్పర సహకార సమన్వయం ఏర్పడాలి. వాతావరణ మార్పులు మన వ్యవస్థలు తట్టుకోలేనంత స్థాయిలో విపత్తులను సృష్టిస్తున్నాయి. మనం నియంత్రించగలిగేది వాటి నష్టాన్ని మాత్రమే. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరుస్తూ, క్రమం తప్పకుండా వచ్చే వరదలు, తుపాన్లతో భారీ నష్టం జరగకుండా తట్టుకునేలా శక్తియుక్తులు కేంద్రీకరించాలి.

## జనాభా లెక్కలే కాదు..

# సామాజిక న్యాయానికి లెక్కలు






డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912

**లెక్క తేలితేనే హక్కు తేలుతుంది**
**బీసీ సాధికారతకు సమగ్ర కులగణనే పునాది**

**దేశంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమతుల్య అభివృద్ధి సాధించాలంటే సమగ్ర కులగణన అత్యంత అవసరం. ఏ సామాజిక వర్గానికి ఎంత జనాభా ఉంది? వారి విద్య, ఉపాధి, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఏ మేరకు అందుతున్నాయి? రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉంది? వంటి ప్రశ్నలకు కచ్చితమైన గణాంకాలు లేకుండా సమర్థవంతమైన విధానాలను రూపొందించడం సాధ్యం కాదు. అందువల్ల దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వే నిర్వహించేందుకు నిర్ణయించి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం రాష్ట్రంలో కులాల వారీగా జనాభా, ఆర్థిక పరిస్థితి, విద్య, ఉపాధి, సామాజిక స్థితిగతులు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలపై వివరాలను సేకరించే ప్రక్రియ చేపట్టింది. ఈ గణాంకాలు సామాజిక న్యాయ విధానాల రూపకల్పనకు కీలక ఆధారంగా నిలుస్తాయి.**

**ఏపీ కూడా సమగ్ర కులగణన చేపట్టాలి**

స్థానిక సంస్థలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు ప్రకటించింది. అయితే రిజర్వేషన్లకు సంబంధించి శాస్త్రీయమైన, తాజా గణాంకాలు అవసరం. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో సమగ్ర కులగణనను తక్షణమే చేపట్టి, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలి. బీసీ రక్షణ, బీసీ సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆ దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలి. కేవలం ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా బీసీల జనాభా, ఆర్థిక స్థితి, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యంపై సమగ్ర సమాచారాన్ని సేకరించాలి.

**ప్రాతినిధ్యంలో అసమానతకు గణాంకాలే సమాధానం**

సమాజంలో కొన్ని ఆధిపత్య వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి మించి అవకాశాలు లభిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదనే ఆవేదన ఉంది. ఈ అసమానతలను భావోద్వేగాల ఆధారంగా కాకుండా నమ్మదగిన గణాంకాల ఆధారంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.సమగ్ర కులగణన ద్వారా ఏ వర్గానికి ఎంత జనాభా ఉంది, విద్యా రంగంలో వారి స్థానం ఏమిటి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంత ప్రాతినిధ్యం ఉంది, రాజకీయాల్లో వారి భాగస్వామ్యం ఎంత, ఆర్థికంగా ఎంత వెనుకబడి ఉన్నారు అనే అంశాలపై స్పష్టత వస్తుంది. తద్వారా అవసరమైన వర్గాలకు లక్షిత సంక్షేమ పథకాలను రూపొందించేందుకు ప్రభుత్వాలకు అవకాశం కలుగుతుంది.

**బీసీల ఐక్యతకు సమగ్ర కార్యాచరణ**

బీసీ వర్గాలు అనేక కులాలు, ఉపకులాలుగా విభజించబడి ఉన్నాయి. వారి సమస్యలు కూడా ప్రాంతం, వృత్తి, ఆర్థిక పరిస్థితి ఆధారంగా భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతులు, సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడిన వర్గాలు మరింత వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయి.అందువల్ల బీసీ వర్గాల్లో అంతర్గత ఐక్యతను పెంపొందించడంతో పాటు, అవకాశాల పంపిణీలో కూడా సమానత్వం ఉండాలి. బీసీ సమాజంలోని ప్రతి కులం, ఉపకులానికి వారి జనాభా, వెనుకబాటుతనం, అవసరాలకు అనుగుణంగా అవకాశాలు అందేలా విధానాలు రూపొందించాలి. దీనికి సమగ్ర కులగణన ఒక బలమైన పునాది అవుతుంది.

**కులవృత్తులకు యాంత్రీకరణ దెబ్బ**

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులు సంప్రదాయ కులవృత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యాంత్రీకరణ, కార్పొరేటీకరణ కారణంగా తరతరాలుగా వృత్తులపై ఆధారపడిన అనేక కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నాయి.స్టీల్, ఇనుము పరిశ్రమల విస్తరణతో సంప్రదాయ కమ్మరి, వడ్రంగి తదితర వృత్తులపై ప్రభావం పడింది. ప్లాస్టిక్ ఉత్పత్తుల విస్తరణతో మేదరి, కుమ్మరి వృత్తులు దెబ్బతిన్నాయి. జేసీబీలు, హిటాచీ వంటి యంత్రాల వినియోగం పెరగడంతో వడ్డెర్లకు సంప్రదాయ ఉపాధి అవకాశాలు తగ్గాయి. సా మిల్లులు, రెడీమేడ్ దుస్తులు, బ్యూటీ పార్లర్లు, ఆధునిక సేవా రంగాలు కూడా సంప్రదాయ వృత్తుల స్వరూపాన్ని మార్చేశాయి. యాంత్రీకరణను అడ్డుకోవడం పరిష్కారం కాదు. యాంత్రీకరణ వల్ల జీవనోపాధి కోల్పోతున్న వర్గాలను కొత్త నైపుణ్యాలతో, ఆధునిక పరికరాలతో, రుణ సదుపాయాలతో, మార్కెట్ అవకాశాలతో అనుసంధానం చేయడం ప్రభుత్వ బాధ్యత.

**బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేయాలి**

బీసీ కార్పొరేషన్లు కేవలం పేరుకే పరిమితం కాకుండా వాస్తవంగా పేద బీసీ కుటుంబాలకు ఆర్థిక సాధికారత కల్పించే సంస్థలుగా పనిచేయాలి. సబ్సిడీ రుణాలు, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక పరికరాల కొనుగోలు, మార్కెటింగ్ సదుపాయాలు, స్వయం ఉపాధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి.ఎంబీసీలు, సంచార జాతులు, అత్యంత వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. ఆయా కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన ఉన్న వ్యక్తులను కార్పొరేషన్లలో బాధ్యతల్లో నియమిస్తే పథకాలు మరింత సమర్థవంతంగా అమలయ్యే అవకాశం ఉంటుంది.సబ్సిడీ రుణాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న యువత, చిన్న వ్యాపారులు, చేతివృత్తిదారులకు ప్రభుత్వం తక్షణమే రుణ ప్రక్రియను సులభతరం చేయాలి. బ్యాంకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అర్హులైన బీసీ లబ్ధిదారులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

**రిజర్వేషన్లతో పాటు ఆర్థిక సాధికారత**

రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి ఒక సాధనం మాత్రమే; అవే అన్ని సమస్యలకు పరిష్కారం కావు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార అవకాశాలు, ఆర్థిక సహాయం, భూమి మరియు వనరుల ప్రాప్తి వంటి అంశాల్లో కూడా సమాన అవకాశాలు కల్పించాలి.బీసీ వర్గాల్లోని పేదరికం, నిరుద్యోగం, విద్యా వెనుకబాటుతనం, వృత్తుల పతనం వంటి సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలి. ముఖ్యంగా మహిళలు, యువత, అత్యంత వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

**గణాంకాలతో సమానత్వానికి బాట**

సమగ్ర కులగణన ఏ కులాన్ని మరొక కులానికి వ్యతిరేకంగా నిలబెట్టే ప్రక్రియ కాకూడదు. అది సమాజంలోని అసమానతలను గుర్తించి, ప్రతి వర్గానికి తగిన అవకాశాలు కల్పించే శాస్త్రీయ సాధనం కావాలి.దేశంలో ఎవరి జనాభా ఎంత? ఎవరి విద్యా స్థాయి ఎంత? ఎవరి ఆదాయం ఎంత? ఎవరు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు? ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఎవరికి చేరుతున్నాయి? ఎవరు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు? వంటి ప్రశ్నలకు సమగ్ర కులగణన సమాధానాలు ఇవ్వాలి.ఆకలి, అజ్ఞానం, అనారోగ్యం, నిరుద్యోగం, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం వనరులు, సంపద, అధికారం, అవకాశాలు అన్ని వర్గాలకూ న్యాయంగా అందాలి. శ్రమకు తగిన గౌరవం, శ్రమకు తగిన ప్రతిఫలం లభించాలి. సంప్రదాయ వృత్తుల నైపుణ్యాలను ఆధునిక ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయాలి.దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించి, ఆ గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ విధానాలను పునర్వ్యవస్థీకరిస్తేనే సామాజిక న్యాయం మరింత అర్థవంతంగా మారుతుంది. కులగణన కేవలం లెక్కల కోసం కాదు.. సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం, సమగ్ర అభివృద్ధి కోసం.

# ఎన్‌టీఏ పనితీరు మారదా?

**యువభారతం భవిష్యత్తును నిర్ణయించే ముఖ్యమైన పోటీపరీక్షల నిర్వహణలో అవే ఘోరాపరాధాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయంటే ఏంటి అర్థం? నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లోని ఎవరో కొందరు వ్యక్తుల అలసత్వ దుష్ఫలితాలు కావు అవి... వంకపెట్టలేని అంకితభావంతో నిర్వర్తించాల్సిన బాధ్యతల పట్ల పట్టింపులేనితనంతో వ్యవస్థ మొత్తంగా దారితప్పిన తీరుకు నిదర్శనాలు! ఉన్నత విద్యాలయాల్లో ప్రవేశాలకు పోటీపడేవారి సామర్థ్యాలను అంచనా వేయడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరీక్షలను సమర్థంగా పారదర్శకంగా నిర్వహించడం ఎన్‌టీఏ కర్తవ్యం. అందులో అది పదేపదే విఫలమవుతూ విద్యార్థుల ఆశలను, వారి తల్లిదండ్రుల కలలను కాలరాస్తుండటమే గర్హనీయం! 'నీట్'-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్ష రద్దు నేపథ్యంలో రేగిన ఆందోళనలు ఇంకా పచ్చిగా ఉండగానే, యూజీసీ-నెట్‌కు సంబంధించి ఎన్‌టీఏ పనితనమూ బయటపడింది. మొన్న జూన్‌లో జరిగిన యూజీసీ-నెట్ పరీక్షల్లో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పేపర్లు తప్పులతడకలుగా ఉన్నాయని ఒప్పుకొన్న ఎన్‌టీఏ- ఆ మూడు ఎగ్జాములను వచ్చే నెలలో తిరిగి పెడతామని తాజాగా ప్రకటించింది. ఇలా చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం బదులు ముందే సరైన పరిశీలనా యంత్రాంగాన్ని, భద్రతా ఏర్పాట్లను కొలువుతీర్చి ఉంటే- లక్షన్నర మందికిపైగా విద్యార్థులు అవస్థలపాలు కావాల్సి వచ్చేదే కాదు కదా? ఉద్యోగాల బాటలో, పరిశోధనా విద్యలో ముందడుగు వేసే కీలక సందర్భంలో విలువైన సమయాన్ని కోల్పోయే దురవస్థ సైతం ఆయా అభ్యర్థులకు తప్పేది!**




జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లకు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకాలకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత సాధించడానికి ఏటా లక్షల సంఖ్యలో యువత యూజీసీనెట్ రాస్తుంటారు. అందులో భాగంగా ఇటీవల ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు అప్పుడే ప్రశ్నపత్రాల్లో లోపాలను గమనించి గగ్గోలుపెట్టారు. పేర్లు, పదాలు, అనువాదాల్లో తప్పులు మొదలు పాత పేపర్లనుంచి పలు ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా పునరావృతం కావడం వరకు ఎన్‌టీఏ అసమర్థ నిర్వాకాలపై తీవ్ర ఆందోళన వ్యక్తంజేశారు. ఇంగ్లిష్, కామర్స్ పేపర్లలోని 60శాతానికిపైగా ప్రశ్నలు 2024 డిసెంబరు ఎగ్జాములో వచ్చినవేనన్న విమర్శలు గట్టిగా వినిపించాయి. సోషియాలజీ విషయంలోనైతే చేతిరాత ప్రశ్నలతో కూడిన వంద పేజీల పీడీఎఫ్ ఒకటి ముందే చలామణీలోకి వచ్చిందని, అందులోని 90 ప్రశ్నలు అసలు పరీక్షలో యథాతథంగా దర్శనమిచ్చాయని కథనాలు వెలువడ్డాయి. ఇలాంటివాటిపై ఫిర్యాదులెన్నో వెల్లువెత్తాక 45 రోజులకు తీరిగ్గా స్పందించిన ఎన్‌టీఏ ఆ మూడు పరీక్షల రద్దుకు నిశ్చయించింది. ప్రశ్నపత్రాల రూపకల్పనలో అలవిమాలిన నిర్లక్ష్యం, వాటిని గోప్యంగా ఉంచడంలో దారుణ వైఫల్యం, వేగంగా నిర్ణయాలు తీసుకుని విద్యార్థులకు భరోసా కల్పించడంలో లెక్కలేనితనం... ఇవేవీ క్షమార్హం కావు!

యూజీసీనెట్ ప్రహసనం దరిమిలా అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్రంగా ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలని కేంద్ర విద్యాశాఖ మొన్న ఎన్‌టీఏను ఆదేశించింది. ఆ సంస్థలోని యాభై మందికి పైగా సిబ్బందిపైనా వేటుపడింది. ఇటువంటివి మళ్లీ జరగకూడదంటే ఎన్‌టీఏ పనితీరును మెరుగుపరచడానికి రాధాకృష్ణన్ కమిటీ చేసిన సిఫార్సులను పూర్తిగా అమలుచేయాలి. నందన్ నీలేకని ఆధ్వర్యంలో కేంద్రం ఇటీవల నియమించిన టాస్క్‌ఫోర్స్ సైతం పోటీపరీక్షల సాకల్య క్షాళనకు ఇంకా తీసుకోవాల్సిన చర్యలపై నిశిత సూచనలు చేయాలి. ప్రభుత్వోద్యోగాలకు ఎంపికల్లోనూ పారదర్శకతకు పట్టంకట్టాలి. రేయింబవళ్లు కష్టపడి చదువుకుని పరీక్షలకు హాజరయ్యే యువతకు ఏ రూపంలోనూ అన్యాయం జరగకుండా ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి!

# నిర్జీవమవుతున్న ప్రజాస్వామ్యం!


**ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వ్యక్తులు సమర్థులు, నైతిక విలువలు ఉన్నవారైతే లోపభూయిష్ఠమైన రాజ్యాంగాన్ని కూడా అత్యుత్తమంగా అమలు చేయగలరు. వారిలో అలాంటి లక్షణాలేమీ లేకపోతే ఏ రాజ్యాంగమూ దేశాన్ని కాపాడలేదు. చెప్పాలంటే, సంవిధానం ఒక యంత్రం లాంటిదంతే. దాన్ని నియంత్రిస్తూ నడిపించే వ్యక్తుల వల్లే అది జీవంపోసుకుంటుంది' అంటూ రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ అక్షరసత్యం పలికారు. దృఢమైన వ్యక్తిత్వం కలిగినవారు, దార్శనికులు, కొద్దిమందికోసం విశాల భారత విస్తృత ప్రయోజనాలను పణంగా పెట్టనివారు దేశానికెంతో అవసరమని ఆయన ఉద్ఘాటించారు. అలాంటి నాయకులను భారతావని పెద్దసంఖ్యలో తయారుచేసుకోగలదన్న ప్రథమ రాష్ట్రపతి ఆశ- కాలక్రమంలో అడియాసగా మిగిలిపోయింది. ధన, భుజ బలసంపన్నులు మినహా ప్రజాసేవానురక్తులైన సామాన్యులు ఎవరూ పోటీపడలేనంతగా ఖరీదైన ఎన్నికలతో మన ప్రజాస్వామ్యమే నిర్జీవమవుతోంది. దారుణ దాష్టీకాలకు పాల్పడ్డారనే నేరారోపణలను నెత్తినమోస్తున్నవారు, జాతి మూలుగను పీల్చేసే ఆర్థిక నేరాల కేసుల్లో నిందితులు నేతలుగా చలామణీ అవుతుండటం- అంతిమంగా సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్య సాధనలో జనభారతం వెనకబాటుతనానికి కారణమవుతోంది!**

సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సుప్రీంకోర్టుకు సమర్పించిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా తాజా, మాజీ ఎంపీలూ ఎమ్మెల్యేలపై 4192 కేసులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. వాటిలో 754 కేసులైతే 510 ఏళ్లుగా అలాగే అపరిష్కృతంగా పడి ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే ఈ కేసులను సత్వరం విచారించాలని సర్వోన్నత న్యాయస్థానం పదేపదే నిర్దేశిస్తోంది. అయినప్పటికీ వాటికి తార్కిక ముగింపు పలకడంలో వ్యవస్థ వైఫల్యం వల్ల నేరన్యాయ విచారణ ప్రక్రియ పరమోద్దేశమే నీరుగారిపోతోంది. 2004లో లోక్‌సభ ఎంపీలుగా గెలిచినవారిలో నేరచరితుల వాటా 23శాతమైతే ఆ తరవాత రెండు దశాబ్దాల్లో అది రెట్టింపైంది. క్రిమినల్ నేరాభియోగాలను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల సంఖ్య రెండువేలకు పైబడింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పరచినప్పటికీ న్యాయమూర్తులు తక్కువగా ఉండటం, విచారణలు ఒక దశకు వచ్చేసరికి జడ్జిలు బదిలీ అవుతుండటం, తరచూ వాయిదాలు పడుతుండటం తదితర కారణాలతో నేరచరిత నేతలపై కేసులు ఒక పట్టాన తెమలట్లేదు. శిక్షల భయం పూర్తిగా కొరవడటంతో నేరగ్రస్థ రాజకీయాల వికృత పర్యవసానాలూ అదుపులోకి రావట్లేదు!

ఆవేశకావేషాల వల్ల ఓ హత్య జరగవచ్చు కానీ, వ్యక్తిగత లాభంకోసం కుట్రపూరితంగా చేసే ఆర్థిక నేరాలకు బాధ్యులైనవారిని శిక్షించకపోతే యావత్ సమాజం నష్టపోతుందని సుప్రీంకోర్టు నాలుగు దశాబ్దాల నాడే హెచ్చరించింది. ఇటువంటి వాటిని దేశార్థిక వ్యవస్థకు ప్రమాదకరమైన తీవ్ర నేరాలుగా పరిగణించాలని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన ఓ కేసులో 'సుప్రీం' పదమూడేళ్ల క్రితం వ్యాఖ్యానించింది. అడ్డూఅదుపూ లేని జాతివనరుల స్వాహాపర్వాలకు సంబంధించిన 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసుల్లో నిందితుడైన జగన్ ఇన్నేళ్లుగా బెయిల్‌పై ఉంటూ, మధ్యలో అయిదేళ్లు నిరంకుశ రాజకీయాధికారాన్ని చలాయించగలగడమే విస్మయకరం. నేరారోపణలు రుజువైనవారిపైనే అనర్హత వేటు వేసే విధానం పాపంకిల రాజకీయాల ప్రక్షాళనకు ఉపకరించట్లేదన్నది వాస్తవం. అయిదేళ్లకు మించి శిక్ష పడే కేసుల్లో సునిశిత న్యాయసమీక్ష అనంతరం నేరాభియోగాల నమోదు దశలోనే ఆయా నేతలను అనర్హులుగా ప్రకటించాలన్న లా కమిషన్ సిఫార్సును అమలుచేస్తే చట్టసభల్లోకి నేరచరితుల ప్రవేశాన్ని కాస్తయినా అడ్డుకోగలం!



# మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి




**- కోల్ ఇండియా తరహా ప్రమోషన్ పాలసీ అమలు చేయాలి**
**- ఏరియా జీఎంకు వినతిపత్రం..**
**- డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం**

మణుగూరు, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:

సింగరేణి మైనింగ్ స్టాఫ్ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, కోల్ ఇండియా తరహా ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు ఏరియా మైనింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మణుగూరు ఏరియా సింగరేణి మైనింగ్ స్టాఫ్ బాధ్యులు బి. సురేందర్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో ప్రాణాలకు తెగించి నిరంతర బొగ్గు ఉత్పత్తికి, కఠినమైన భద్రతా ప్రమాణాల అమలుకు కృషి చేస్తున్న మైనింగ్ స్టాఫ్ తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు:**
కోల్ ఇండియాతో సమానంగా ప్రమోషన్లు: కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా అర్హులైన ఎన్‌సీడబ్ల్యూఏ టెక్ అండ్ సూపర్‌వైజరీ గ్రేడ్ స్టాఫ్ అందరికీ ఈ2 అండర్ మేనేజర్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.2016, 2017 జేఎంఈటీ బ్యాచ్‌లకు న్యాయం: 2016, 2017 జేఎంఈటీ బ్యాచ్‌లకు చెందిన 470 మందికి పైగా అర్హులైన అభ్యర్థులకు బ్యాక్‌డేట్‌తో ప్రమోషన్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు.మెడికల్ ఇన్‌వాలిడేషన్: వైద్యపరంగా అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్‌కు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఉన్నత విద్యకు ఎన్‌ఓసీ: స్టాఫ్ ఉన్నత సాంకేతిక విద్య, ప్రొఫెషనల్ డిగ్రీలు అభ్యసించేందుకు ఎన్‌ఓసీ పాలసీని అమలు చేయాలని కోరారు.ఇంటర్నల్ అభ్యర్థులకు ప్రాధాన్యత: ఎక్స్‌టర్నల్ అండర్ మేనేజర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఇంటర్నల్ అభ్యర్థుల ప్రమోషన్, సెలక్షన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.క్యాడర్ స్కీమ్‌లో సడలింపు: క్యాడర్ స్కీమ్‌ను సడలించి, 2024 ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ జేఎంఈటీ బ్యాచ్‌లకు అనుకూలమైన ప్రమోషన్ పాలసీని రూపొందించాలని కోరారు.

**నల్ల బ్యాడ్జీలతో నిరసన**
ఈ నెల 24, 25 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడంతో పాటు సంబంధిత మైన్ మేనేజర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లకు వినతిపత్రాలు సమర్పించారు. 26న నల్ల బ్యాడ్జీలతో సంబంధిత జీఎం కార్యాలయాల వద్ద నినాదాలు చేస్తూ వినతిపత్రాలు అందజేశారు. 27న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద ఉదయం 10 గంటలకు శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లక తప్పదని మైనింగ్ స్టాఫ్ హెచ్చరించారు. దీనివల్ల సింగరేణి వ్యాప్తంగా భద్రత, బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ సభ్యులు బి. గణేష్‌కుమార్, ఏ. దైవేశ్వరరావు, డి. సుకుమార్, పి. నవీన్, శామ్యూల్, డి. సంతోష్, నరసింహచారి, శ్రీకాంత్, గౌతమ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



**- మంత్రి అడ్లూరికి పాయం వెంకటేశ్వర్లు వినతి**

మణుగూరు, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:

పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. నియోజకవర్గంలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వంతెనల సౌకర్యాలు లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే వివరించారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో పలు బీటీ రోడ్లు, హైలెవల్ వంతెనల నిర్మాణం అత్యవసరమని తెలిపారు. ఈ పనులకు ప్రభుత్వం త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు రైతులు పంటలను మార్కెట్లకు, విద్యార్థులు విద్యాసంస్థలకు, రోగులు అత్యవసర సమయంలో ఆసుపత్రులకు సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఓటరు జాబితాలో ప్రతి అర్హ్లు డి పేరు నమోదు కావాలి

**- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి**

మహేశ్వరం, ఆగస్టు 26,( అనంత జనశక్తి )



ఓటు మన ప్రజాస్వామ్య హక్కు అని, ప్రతి అర్హుడి ఓటు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండేలా బూత్ లెవెల్ కమిటీ, విలేజ్ లెవెల్ కమిటీ, మండల కమిటీలు బాధ్యతగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు.ఆగస్టు 27, 2026న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో ఓటరు జాబితాపై ప్రత్యేక సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే భయపడాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అక్కడికక్కడే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే జాబితాలో పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.మీ ఓటు మీ హక్కు, మీ ఓటు మీ భవిష్యత్తు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా మనమందరం కలిసి పనిచేద్దాం అని పిలుపునిచ్చారు.

# అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**- రేగా–పాయం అభివృద్ధిపై గుండాల బొడ్రాయి సెంటర్‌లో చర్చిద్దాం**
**- కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ సవాల్**

గుండాల, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:



ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచక పాలన సాగిస్తోందని గుండాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తెల్లం భాస్కర్, సీనియర్ నాయకులు మోకాళ్ల వీరస్వామి, గడ్డం వీరన్న ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై పెట్టిన కేసులు హైకోర్టులో నిలవలేదని పేర్కొన్నారు. రేగా కాంతారావు అక్రమ ఆస్తులు సంపాదించారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఆధారాలు ఉంటే బయటపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేతుల్లోనే ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఉన్నప్పుడు అక్రమ ఆస్తులు ఉంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడకుండా అభివృద్ధి, ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టామని వారు అన్నారు. ప్రస్తుతం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

**అభివృద్ధిపై లెక్కలు తేల్చుకుందాం**
"రేగా కాంతారావు చేసిన అభివృద్ధి.. పాయం వెంకటేశ్వర్లు చేసిన అభివృద్ధి"పై గుండాల మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ప్రజల సమక్షంలో ఇరువైపులా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, వాస్తవాలను వెల్లడిద్దామని సవాల్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడరని, రాజకీయ కక్ష సాధింపులు కొనసాగిస్తే తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి టి. రాము, యువజన విభాగం అధ్యక్షుడు సయ్యద్ అజ్జు, కుంట సుధాకర్, తాటి కృష్ణ, పొంబోయిన సుధాకర్, బాల్య రాము, బొమ్మెర్ల శ్రీను, బొమ్మెర రవి, బొమ్మెర్ల పద్మారావు, బొమ్మెర్ల సతీష్, దానసరి భాస్కర్, భూక్య బాలు, గుగులోతు కాలు, గుగులోతు రవి, బొమ్మెర్ల శ్రీకాంత్, బొమ్మెర కృష్ణ, మహిళా మండల నాయకురాలు భూపెల్లి లలిత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఖండన

**- రేగా కాంతారావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు ఉందా?**
**- అభివృద్ధి, ప్రజా సమస్యలపై బహిరంగ చర్చకు సిద్ధం**

మణుగూరు, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:




కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు మాట్లాడుతూ, స్థాయికి మించి వ్యాఖ్యలు చేయడం సరికాదని, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఏ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారో కాంగ్రెస్ నాయకులే ఒకసారి స్పష్టం చేయాలని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఆడబిడ్డలకు అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాల అమలుపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ నెల 24న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించామని, దీనిని చూసి కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజకీయ చరిత్ర గురించి నవీన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, రేగా కాంతారావును విమర్శించే ముందు తన రాజకీయ ప్రస్థానాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. రేగా కాంతారావు అక్రమ ఆస్తులు సంపాదించారని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఆధారాలను బయటపెట్టాలని, అవి అక్రమ ఆస్తులని నిరూపిస్తే ప్రజలకు రాసిచ్చేందుకు రేగా కాంతారావు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అయితే ఈ సవాలును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి ఆడబిడ్డలకు అన్యాయం జరగకుండా చూడాలని అన్నారు.
అనంతరం రాజకీయ విమర్శలు చేసుకోవాలని సూచించారు. రేగా కాంతారావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించిన వారు, ఎవరి బలం ఎంత ఉందో ప్రజల్లోకి వస్తే తెలుస్తుందని అన్నారు. సమావేశాల్లో కూర్చొని మైకులు పట్టుకుని విమర్శలు చేయడం కాకుండా ప్రజల మధ్యకు రావాలని సూచించారు.
ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల హక్కు అని, ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగజారడం సరికాదన్నారు. ర్యాలీలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించే ముందు ప్రజలు ఎందుకు రోడ్డెక్కాల్సి వస్తుందో తెలుసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని చూస్తే మరింత గట్టిగా ప్రజల మధ్యకు వెళ్లి ప్రజా సమస్యలను వినిపిస్తామని తెలిపారు. ప్రజలే న్యాయనిర్ణేతలని, రేగా కాంతారావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలకు తావివ్వకుండా రాజకీయ ప్రచారానికి, అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధమైతే కాంగ్రెస్ నాయకులు లేదా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బహిరంగ వేదికపైకి రావాలని సవాల్ చేశారు. తాము చేసిన అభివృద్ధి, రేగా కాంతారావు చేసిన అభివృద్ధిపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు సిద్ధమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అక్కి నరసింహారావు, తడికమళ్ల ప్రభుదాస్, వేర్పుల సురేష్, మడి స్వరూప (సర్పంచ్), కొమరం జంపేశ్వరి (సర్పంచ్), బొగ్గం రజిత, ఎస్‌డీ జావిద్ పాషా, సకిని బాబూరావు, కటబోయిన సుజాత, పెనుగొండ మహేష్, మేకల సుప్రియ, మేకల జోష్నా, వావిలాల నర్సయ్య, పొడుతూరి విక్రమ్, కారం నరసింహారావు, చందా నాగేశ్వరరావు, బద్దుల ప్రసాద్, గుండారపు మురళి, మండారి సతీష్, ఉప్పాక సత్యనారాయణ, అప్పయ్య, వనమాల రాంబాబు, నాగారపు సతీష్, ముత్యం రమేష్, రావులపల్లి వెంకటేష్, ఆవుల శ్రీనివాస్, వేర్పుల శంకర్, బీఆర్ఎస్ మణుగూరు సోషల్ మీడియా అధ్యక్షుడు డేగల సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్

**- 262 ఇళ్ల తనిఖీ.. 82 ద్విచక్ర వాహనాలపై చర్యలు**
**- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం.. ప్రజలకు పోలీసుల సూచనలు**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,
ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున భద్రాచలం పట్టణంలోని శుభాష్‌నగర్ కాలనీలో పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాలనీలోని 262 ఇళ్లను తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలనీలో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న 82 ద్విచక్ర వాహనాలను గుర్తించి, పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

**ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్**
అనంతరం డీఎస్పీ అరుణ్‌కుమార్ కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సక్రమంగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నంబర్ ప్లేట్లను ట్యాంపర్ చేయడం, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా వంటి మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గంజాయికి బానిసైన వ్యక్తుల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వారిని డీఅడిక్షన్ కేంద్రాలకు పంపించి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**
నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని తగిన ధ్రువీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముందుగా బిడ్డ... తర్వాతే రాయి

**- కాన్పు తర్వాత గర్భిణికి 4 సెంటీమీటర్ల కిడ్నీ రాయికి సురక్షితంగా చికిత్స అందించిన ఐనూ హాస్పిటల్ హైటెక్ సిటీ వైద్యులు**
**- పెద్ద స్టాగ్‌హార్న్ కిడ్నీ రాయితో బాధపడుతున్న గర్భిణికి నిరంతర పర్యవేక్షణ... ప్రసవం అనంతరం విజయవంతంగా శస్త్రచికిత్స**

హైదరాబాద్, ఆగస్టు 26,అనంత జనశక్తి న్యూస్




గర్భధారణ సమయంలో 4 సెంటీమీటర్ల మేర పెద్ద కిడ్నీ రాయితో బాధపడుతున్న 27 ఏళ్ల మహిళకు ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (AINU ఐనూ) హాస్పిటల్ హైటెక్ సిటీ వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. గర్భధారణ కాలమంతా ఆమె ఆరోగ్యాన్ని నిశితంగా పరిశీలిస్తూ, కాన్పు పూర్తయ్యే వరకు ప్రధాన చికిత్సను వాయిదా వేసి, ప్రసవానంతరం రాయిని తొలగించారు.గర్భధారణ సమయంలో ఆ మహిళకు ఎలాంటి తీవ్రమైన లక్షణాలు కనిపించలేదు. అయితే, మొదటి త్రైమాసికంలో చేసిన మూత్ర పరీక్షలలో పస్ సెల్స్, ప్రొటీనూరియా మరియు మైక్రోస్కోపిక్ బ్లడ్ కనిపించాయి. మూత్ర పరీక్షల (కల్చర్) లో ఈ కొలి ఇన్ఫెక్షన్ కూడా బయటపడింది. ఏడో నెలలో చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఆమె ఎడమ మూత్రపిండంలో దాదాపు 35 × 18 మిమీ పరిమాణంలో ఒక పెద్ద స్టాగ్‌హార్న్ కిడ్నీ రాయి ఉన్నట్లు గుర్తించారు. ఇది మూత్రపిండంలో సగానికి పైగా భాగాన్ని ఆక్రమించింది.ఈ కేసులోని సంక్లిష్టత గురించి ఐనూ హాస్పిటల్ హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ దీపక్ రాగూరి మాట్లాడుతూ... "గర్భధారణ సమయంలో అంత పెద్ద కిడ్నీ రాయి ఉండటం వల్ల శస్త్రచికిత్స విషయంలో సరైన నిర్ణయం తీసుకోవడం సవాలుగా మారింది. రాయి పరిమాణం, ఆకారం ఆందోళన కలిగించినప్పటికీ, బాధితురాలి ఆరోగ్యం స్థిరంగా ఉంది. ఆమె పరిస్థితిని, గర్భధారణ దశను పరిగణనలోకి తీసుకుని, వెంటనే సర్జరీ చేయకుండా నిరంతర పర్యవేక్షణ (కన్సర్వేటివ్ మేనేజ్‌మెంట్)తో ముందుకు వెళ్లాలని ఐనూ వైద్య బృందం నిర్ణయించింది" అని తెలిపారు.ఆ తర్వాత గర్భధారణ సురక్షితంగా సాగింది. సదరు మహిళ సిజేరియన్ ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చారు. ప్రసవం జరిగిన రెండు వారాల తర్వాత ఆమె తదుపరి పరీక్షల కోసం యూరాలజీ వైద్య బృందాన్ని సంప్రదించారు. కాన్పు తర్వాత చేసిన సీటీ స్కానింగ్‌లో ఆ రాయి పరిమాణం 4.1 × 2.7 సెంటీమీటర్లుగా నమోదైంది. రాయి పరిమాణం పెద్దదిగా ఉండటంతో, కనీస ముప్పు ఉండే మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతి 'పెర్క్యుటేనియస్ నెఫ్రోలిథోటోమీ' (PCNL) ద్వారా దానిని తొలగించాలని వైద్యులు నిర్ణయించారు. సిజేరియన్ జరిగిన ఆరు వారాల తర్వాత జనరల్ అనస్థీషియా ఇచ్చి మహిళకు పీసీఎన్ఎల్ (PCNL) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ కేసు గర్భిణులలో కిడ్నీ రాళ్ల చికిత్సకు సంబంధించి ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేస్తోంది: కిడ్నీ రాయిని గుర్తించిన వెంటనే శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం లేదు. పేషెంట్ లక్షణాలు, ఇన్ఫెక్షన్, మూత్రనాళంలో అడ్డంకులు, రాయి పరిమాణంలొకేషన్, కిడ్నీ పనితీరు, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిస్థితి ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది."గర్భిణి ఆరోగ్యం స్థిరంగా ఉండి, తక్షణ అత్యవసర వైద్య చికిత్స అవసరం లేనప్పుడు, సరైన పర్యవేక్షణతో గర్భధారణను సురక్షితంగా ముందుకు తీసుకెళ్లవచ్చు. ప్రసవం పూర్తయ్యాక నిశ్చింతగా ప్రధాన చికిత్స చేయవచ్చు. అయితే, గర్భధారణ సమయంలో కిడ్నీ రాళ్లను నిర్లక్ష్యం చేయకూడదు. నొప్పి, జ్వరం, మూత్రనాళ ఇన్ఫెక్షన్ లేదా తల్లి ఆరోగ్యం క్షీణించడం వంటి సమస్యలు వస్తే మాత్రం తక్షణమే వైద్యులను సంప్రదించి అత్యవసర చికిత్స పొందాల్సి ఉంటుంది" అని డాక్టర్ దీపక్ రాగూరి వివరించారు .ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ చలపతి రాజు, డాక్టర్ విశ్వజిత్ రెడ్డి, డాక్టర్ నీలం మరియు డాక్టర్ ఎల్. ఉదయ్ కుమార్ పాలుపంచుకున్నారు.ఇన్ఫెక్షన్ లేదా ఇతర సమస్యల ముందస్తు సంకేతాలను గుర్తించి వెంటనే సరైన చికిత్స అందించడానికి క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణ (ఫాలోఅప్) చాలా అవసరమని ఐనూ హాస్పిటల్ హైటెక్ సిటీ వైద్య బృందం స్పష్టం చేసింది.ఈ కేసు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. గర్భధారణ సమయంలో కిడ్నీ రాళ్లకు చికిత్స అందించేటప్పుడు అతి తొందరగా చేసే చికిత్స కంటే, సరైన సమయంలో సురక్షితంగా చేసే చికిత్సే ఎంతో మేలు చేస్తుంది. సరైన సమయాన్ని, సురక్షిత మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కిడ్నీ రాళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు.

# పినపాక నియోజకవర్గానికి రూ.70 కోట్ల పంచాయతీరాజ్ నిధులు

**- మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు**
**- రోడ్లు, వంతెనలు, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు వినియోగం**

**మణుగూరు, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:**



పినపాక నియోజకవర్గ అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ లో రూ.70 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాద్రి రామయ్య స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం పినపాక నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో రహదారులు, హై లెవల్ బ్రిడ్జిలు, బీటీ రోడ్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ రూ.70 కోట్ల నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయితే మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సులభంగా వెళ్లేందుకు, ప్రజలు వైద్య సేవల కోసం ఆసుపత్రులకు చేరుకునేందుకు, రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లిన సమయంలో రాకపోకలకు ఏర్పడే ఇబ్బందులు తగ్గుతాయని, అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతర వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పినపాక నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. రాబోయే రోజుల్లోనూ పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

# రాష్ట్ర లైబ్రేరియన్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే జారె



**రేపు హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం..**

**అశ్వారావుపేట, ఆగస్టు 26, అనంత జనశక్తి న్యూస్:**

అశ్వారావుపేట శాసనసభ్యుడు జారె ఆదినారాయణ రాష్ట్ర లైబ్రేరియన్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన రేపు హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు, యువత, పుస్తక పఠన ప్రియులు, అభిమానులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్య, విజ్ఞానం, పుస్తక పఠనం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. రాష్ట్ర లైబ్రేరియన్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు బాధ్యతలు దక్కడం అశ్వారావుపేట నియోజకవర్గానికి గర్వకారణమని వారు అభిప్రాయపడ్డారు.

గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు మరింతగా వినియోగించుకునేలా అవసరమైన వసతులు, పుస్తకాలు, డిజిటల్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధి జరిగితే విద్యార్థులు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ రాష్ట్ర లైబ్రేరియన్ కమిటీ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం, విద్యార్థులకు మెరుగైన అధ్యయన వాతావరణం కల్పించడం, యువతలో విజ్ఞానాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో ఆయన చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. రాష్ట్ర లైబ్రేరియన్ కమిటీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు, యువత, పుస్తక పఠన ప్రియులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

# బాలాపూర్ గణేష్ అందరివాడు, ఒక వర్గానికే చెందినవాడు కాదు

**- బాలాపూర్ గణేష్ మండపం వద్ద ఎస్సి, ఎస్టీ, బిసి యువకుల నిరసన**

**మహేశ్వరం, ఆగస్టు 26,( అనంత జనశక్తి )**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పేరుతో గణేషుడిని ఏర్పాటు చేసి బాలాపూర్ గ్రామస్తులకే విలువ ఇవ్వడం లేదని బాలాపూర్ గ్రామ ప్రజలు, ఎస్సి ఎస్టీ బిసి యువకులు ఆవేదన వ్యక్తం చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా కేవలం ఒకే వర్గం వారు బాలాపూర్ గణేష్ ఉత్సవాలను శాసిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బాలాపూర్ గణేష్ మండపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ బాలాపూర్ గ్రామంలో స్వయంభుగా వెలసిన వేణుగోపాల స్వామి ఆలయ వేడుకలు, బాలాపూర్ ధర్మ రక్షణ సభ, బొడ్రాయి వేడుకలలో అన్ని కుల సంఘాలను కలుపుకుని ఘనంగా నిర్వహిస్తున్నట్లే, బాలాపూర్ గణేష్ ఉత్సవాలను కూడా అన్ని కులాలను కలుపుకుని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వారి ప్రధాన డిమాండ్లు:

ఐక్య కమిటీ ఏర్పాటు:
వెంటనే బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీని పునర్వ్యవస్థీకరించి, అందులో అన్ని కుల సంఘాలకు చెందిన యువకులకు భాగస్వామ్యం కల్పించాలి.

కుల వివక్షకు స్వస్తి:
బాలాపూర్ గణేశుడు అందరివాడు, ఏ ఒక్క వర్గానికో చెందినవాడు కాదు. గణేష్ మండపంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ పద్ధతిని మార్చాలి.

పారదర్శక లెక్కింపు: భక్తులు సమర్పించే కట్నకానుకలు, హుండీ డబ్బుల లెక్కింపును వ్యక్తిగత ఇళ్లలో కాకుండా, గ్రామంలోని స్వయంభు వేణుగోపాల స్వామి దేవాలయంలో బహిరంగంగా లెక్కించాలి.

గ్రామాభివృద్ధికి నిధులు:
ఆ విధంగా వచ్చిన ఆదాయాన్ని బాలాపూర్ గ్రామ అభివృద్ధి పనులకు వినియోగించాలని వారు కోరారు. బాలాపూర్ గణేష్ ఉత్సవాలను రాజకీయాలకు, కులాలకు అతీతంగా, గ్రామమంతా ఏకమై ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా యువకులు పిలుపునిచ్చారు.



# శివగల్ల యాదయ్య మాతృమూర్తికి నివాళులు అర్పించి పరామర్శించిన టియూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి

**మహేశ్వరం, ఆగస్టు 26,( అనంత జనశక్తి )**

మహేశ్వరం మండలం 67వ డివిజన్ మంఖాల్ కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివగల్ల యాదయ్య మాతృమూర్తి ఈరోజు ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు.విషయం తెలుసుకున్న తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి వెంటనే మంఖాల్ లోని వారి నివాసానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా యాదయ్య ని, వారి కుటుంబ సభ్యులను చల్లా నరసింహారెడ్డి పరామర్శించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

# నాగారంలో ఘనంగా ఈద్-మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

**ముఖ్య అతిథిగా నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం**

**మహేశ్వరం, ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్**

**ఈద్-మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు.హజ్రత్ మహబూబ్ షుబాని గౌసేపాక్ దర్గా మత పెద్ద ఇబ్రహీం ఖాన్ ఆధ్వర్యంలో విద్యా వికాస్ స్కూల్ నుంచి దర్గా వరకు పెద్ద ఎత్తున ఈ ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా ఇబ్రహీం ఖాన్ మాట్లాడుతూ.. దైవ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన సోదరభావం, దయ, కరుణ, నిజాయితీ, మానవత్వం, శాంతి వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. కులమతాలకు అతీతంగా ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమం కోసం ప్రవక్త అందించిన సందేశాన్ని ప్రజలందరూ పాటించాలని సూచించారు.ర్యాలీలో పాల్గొన్న యువత, భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, మతం లేదా కులం పేరుతో ఇతరులను దూషించవద్దని ముస్లిం మత పెద్దలు సూచించారు.ర్యాలీకి సహకరించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన మహేశ్వరం ఎస్‌హెచ్‌వో, సీఐ రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం, మహేశ్వరం ఎస్ఐ ప్రసాద్, ఇంటెలిజెన్స్ పోలీస్ మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ లతీఫ్ ఖాన్ హాజరయ్యారు.వార్డు సభ్యులు షాహాబుద్దీన్ ఖాన్, నహీం ఖాన్, ఫిరోజ్ ఖాన్, షానవాజ్ ఖాన్, షేక్ ఛాన్ పాషా, గని ఖాన్, అంజాద్ ఖాన్, ఆఫ్రోజ్ ఖాన్, పేరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.**



# సీనియర్ నటుడు జీవీ నారాయణ రావు కన్నుమూత

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**





ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, బుధవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. ''మరొక హీరో మన భువి తారాలోకం వీడి గగన మార్గం గుండా ఆ శివుని చేరుకున్నారు కొద్ది సేపటి క్రితం.. మన అందరి అభిమాన కథానాయకుడు చిరంజీవి గారు బాల్య మిత్రుడు అజాత శత్రువు. అందరిని ఆప్యాయంగా పలకరించే మంచి మనిషి మనల్ని వీడి శివైక్యం కావడం చాలా బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. పోయినోళ్లందరూ మంచోళ్ళు ఉన్నోళ్లు పోయినోళ్ళ తీపి గుర్తులు. ఓం శాంతి'' అని కళ్యాణి పోస్ట్ పెట్టారు. జీవీ నారాయణ రావుతో కలిసి దిగిన ఫోటోని పంచుకున్నారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తున్నారు.

జీవీ నారాయణ రావు 1953లో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లు, హైదరాబాద్ లలో సాగింది. ఆయన తండ్రి జి ప్రసాదరావు కొంతకాలం డిస్ట్రిబ్యూటర్ గా, సారథీ స్టుడియోకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. చిన్నప్పటి నుంచే నారాయణ రావుకు నటనపై ఆసక్తి ఉండేది. చదువుకునే రోజుల్లో కొన్ని నాటకాలు కూడా వేశారు. 1973లో మద్రాసు ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఫిలిం ఇన్‌స్టిట్యూట్ మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందారు. సూపర్ స్టార్ రజనీకాంత్ ఆయనకు బ్యాచ్ మేట్. అక్కడే వీరి మధ్య ఫ్రెండ్ షిప్ ఏర్పడింది.

1976లో కె. బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు జేవీ నారాయణ రావు. 'తాళికట్టు శుభవేళ' పాటలో ఆయన నటనకు ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రానికి గాను ఆయన ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఆ తర్వాత 'ఒక ఊరి కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ' లాంటి పలు సినిమాలలో హీరోగా నటించారు. కానీ ఆశించిన విజయాలు దక్కలేదు. దీంతో మళ్లీ సపోర్టింగ్ రోల్స్ చేయాల్సి వచ్చింది. ఆయన కెరీర్ లో సుమారు 100 సినిమాలలో నటించారు. సినిమాలతో పాటుగా టీవీ సీరియల్స్ కూడా చేశారు.

మెగాస్టార్ చిరంజీవితో నారాయణ రావుకు మంచి సాన్నిహిత్యం ఉంది. 'చట్టానికి కళ్లులేవు', 'మంచు పల్లకి', 'రాజా విక్రమార్క', 'గ్యాంగ్ లీడర్', 'హిట్లర్' వంటి చిత్రాల్లో చిరుతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఆయన నిర్మాణంలో చిరంజీవి హీరోగా 'దేవాంతకుడు', 'యముడికి మొగుడు' చిత్రాలను నిర్మించారు. ఆ తర్వాత 'యముడికి మొగుడు' సినిమానే తమిళంలో తన ఫ్రెండ్ రజనీకాంత్ తో రీమేక్ చేశారు. నారాయణ రావు పలు ఇంటర్వ్యూలలో చిరంజీవి, రజనీకాంత్ లతో తనకున్న అనుబంధం గురించి వెల్లడించారు.

# 'కొండా సురేఖ విషయంలో సీఎం మాటే నా మాట'.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి వ్యవహారంలో.. ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ తన రిపోర్టును టీపీసీసీకి అందించిందని.. ఇందులో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఇదే విషయాన్ని చెప్పారని.. ఈ వ్యవహారంలో సీఎం మాటే తన మాట అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఇక కొండా సురేఖ వ్యవహారంలో రాయబారం చేసేందుకే తాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశానని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు, చిన్నారెడ్డి వ్యవహారంపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కమిటీఉందని గుర్తుచేశారు. సంబంధిత అంశాలను పరిశీలించిన కమిటీ పీసీసీకి నివేదిక సమర్పించిందని చెప్పారు. ఇక దీనిపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరని అన్నారు. ఇటీవల కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటాననే సంకేతాన్ని ఆయన ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తన భేటీపై కూడా రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కని కలవడం పూర్తిగా తన నియోజకవర్గ అభివృద్ధి, నిధులకు సంబంధించిన అంశాల కోసమేనని చెప్పారు. కొండా సురేఖ వ్యవహారంపై చర్చించేందుకే తాను భట్టిని కలిశారన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతను అని.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. 2018 ఎన్నికల్లో పలువురు కీలక కాంగ్రెస్ నేతలు ఓడిపోయినప్పటికీ మునుగోడు ప్రజలు తనను గెలిపించారని కోమటిరెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా తాను పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. ఇతర పార్టీల నుంచి ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల.. ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన అసలైన కార్యకర్తలకు నష్టం జరగకూడదని తాను చెబుతున్నానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. నిజాయితీగా ఉద్యమంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పార్టీ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

తాను పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి.. వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డిని లేదా ఇతర కాంగ్రెస్ నేతలను విమర్శించలేదని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసమే తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని.. కాంగ్రెస్‌ను బలహీనపరిచేలా తాను ఎప్పుడూ వ్యవహరించబోనని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తనపై దుష్ప్రచారం చేస్తున్న కొన్ని మీడియా సంస్థలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీడియా, జర్నలిస్టులంటే తనకు గౌరవం ఉందని చెబుతూనే.. కొందరు వ్యక్తులకు అనుకూలంగా పనిచేస్తూ తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచారం చేయడం సరికాదన్నారు. తనను, తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నిజమైన నాయకులను కించపరిచేలా కథనాలు రాస్తే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.

అనంత జనశక్తి
గురువారం | రంగారెడ్డి
27.08.2026


# వివాదం వేళ.. కృతి సనన్ రాఖీ యాడ్ తొలగింపు



కృతి సనన్ నటించిన 'రక్షా బంధన్ యాడ్'ను ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'జివ' తొలగించింది. ఈ ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవ్వడం, రాజకీయంగానూ చర్చనీయాంశం కావడంతో సదరు సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

దీనిపై 'జివ' వివరణ ఇచ్చింది. "మాకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పండగలపై ఎంతో గౌరవం ఉంది. రాఖీ లాంటి పండగను కుటుంబమంతా చేసుకోవాలని మేం భావించాం. అందులో భాగంగానే పెంపుడు జంతువులకు కూడా ప్రేమను పంచాలనుకున్నాం. కానీ, మా యాడ్ వల్ల సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతిన్నాయి. మేం ఉద్దేశపూర్వకంగా ఇలా చేయలేదని మరోసారి స్పష్టం చేస్తూ.. ఈ ప్రకటనను అన్ని మాధ్యమాల నుంచి తొలగిస్తున్నాం. ఈ పండగను మీ అందరూ ఎంతో ఆనందంగా చేసుకోవాలని కోరుకుంటున్నాం" అని 'జివ' ఓ నోట్ విడుదల చేసింది

రాఖీ నేపథ్యంలో ఇటీవల ఈ యాడ్‌ను విడుదల చేయగా ఇందులో కృతి వస్త్రధారణ, పెంపుడు శునకానికి రాఖీ కట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అలాంటి దుస్తులు వేసుకుని రాఖీ కట్టడాన్ని తప్పపడుతూ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మండిపడ్డారు. సంప్రదాయ భారతీయ పండగకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలో తెలియదా అంటూ ప్రశ్నించారు. ఇదే సమయంలో కృతికి రాహుల్ గాంధీ మద్దతిచ్చారు. ఆయనకు కౌంటర్ ఇస్తూ మళ్లీ కంగనా పోస్ట్ పెట్టారు. ఈ వరుస వాడీ వేడి పోస్టుల నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.



# ఇద్దరు అధికారులు.. ఒకటే సత్యం



కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్, బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'దాయరా'. మేఘనా గుల్జార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. వినీత్ జైన్, ధవల్ గడా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఓ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ఇద్దరు అధికారులు. రెండు దృక్కోణాలు. ఒకే సత్యం. ఆగస్టు 31న అధికారిక ట్రైలర్ విడుదల కానుంది" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ పోస్టర్‌లో పృథ్వీ, కరీనా ఇద్దరు సీరియస్ లుక్‌లో వారి వెనక అస్పష్టంగా ఉన్న ఒక ముఖం కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. ఇద్దరు అధికారులు రెండు వేర్వేరు దర్యాప్తులతో ఒకే విధమైన సత్యాన్ని అన్వేషించడమే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా హిందీ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'ఇరుముడి' జోష్.. వచ్చే సంక్రాంతి బరిలో రవితేజ కొత్త చిత్రం..



ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో అత్యంత వేగంగా సినిమాలు చేసే కథానాయకుల్లో రవితేజ ముందు వరుసలో ఉంటారు. జయాపజయాలతో సంబంధం లేకుం డా వరుస చిత్రాలతో అలరిస్తుంటారు. తాజాగా 'ఇరుముడి'తో బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్న ఆయన కొత్త చిత్రాన్ని ప్రకటించారు. హసిత్ గోలి దర్శకత్వంలో ఆయన నటించనున్న చిత్రం 'దాగుడు మూత లు దండాకోర్'. ఎంటర్‌టైన్‌మెంట్ హార్డ్‌కోర్ అనేది ఉప శీర్షిక. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు.

**విడుదల తేదీ ఖరారు**

ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తవగా, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది.ఈ సినిమాను ప్రకటించిన రోజునే విడుదల తేదీని కూడా చెప్పడం విశేషం. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. అంటే కేవలం నాలుగు నెలల్లో షూటింగ్ పూర్తి చేసి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. హసిత్ గోలి ఇప్పటివరకూ మూడు సినిమాలు (మెంటల్ మదిలో, రాజ రాజచోర, శ్వాగ్) తీయగా, ఆ మూడు శ్రీవిష్ణుతో చేయడం విశేషం. అవన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌నే సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు రవితేజతో కలిసి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యారు.

# జడేజా.. ఏంటయ్యా ఇది..




రవీంద్ర జడేజా.. టెస్టుల్లో భారత జట్టుకు ఎంతోకాలంగా అటు బంతితో, ఇటు బ్యాట్‌తో సత్తాచాటుతూ ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. అయితే, ఈ ఆల్‌రౌండర్‌ను కొన్నాళ్లుగా ఓ బలహీనత ఇబ్బందిపెడుతోంది. ఇతర స్పిన్నర్లతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే ఓవర్‌ను పూర్తి చేసే జడ్డూ ఈ మధ్య నో బాల్స్ ఎక్కువగా వేస్తున్నాడు. ప్రస్తుతం శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులోనూ ఇప్పటివరకు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మూడు నో బాల్స్ వేశాడు. 2021 నుంచి ఇప్పుడు లంకతో జరుగుతున్న రెండో టెస్టు వరకు అతను ఏకంగా 88 నో బాల్స్ వేయడం గమనార్హం.

ఈ కాలంలో టెస్టు క్రికెట్‌లో అత్యధిక నో బాల్స్ వేసింది జడేజానే. రెండో స్థానంలో ఉన్న పాకిస్థాన్ స్పిన్నర్ నోమాన్ అలీ (40) కంటే జడేజా రెట్టింపు కంటే ఎక్కువ నోబాల్స్ వేయడం గమనార్హం. నో బాల్ వేస్తే ప్రత్యర్థి జట్టుకు అదనంగా ఒక పరుగే వచ్చినప్పటికీ అదే బంతికి కీలకమైన బ్యాటర్ వికెట్ పడితే అప్పుడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావొచ్చు. జడేజా ఈ బలహీనతను వీలైనంత తొందరగా అధిగమించాలని భారత మాజీలు, ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత స్పిన్నర్లు నాలుగో రోజు ఆట ముగిసేసరికి 10 నోబాల్స్ వేశారు. ఈ సమస్యను అరికట్టడానికి టెస్టుల్లోనూ ఫ్రీ హిట్‌ను ప్రవేశపెడితే నోబాల్స్ సంఖ్య కచ్చితంగా తగ్గుతుందని టీమ్‌ఇండియా స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే అభిప్రాయపడ్డారు.

**డీఆర్'ఎస్' కావట్లేదు**

ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న జడేజా .. డెసిషన్ రివ్యూ సిస్టమ్ (డీఆర్ఎస్) విషయంలో సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాడు. బ్యాటర్ల ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేయడం, అంపైర్ ఔట్ ఇవ్వకపోతే కెప్టెన్లను బలవంతంగా ఒప్పించి రివ్యూలు తీసుకునేలా చేస్తున్నాడు. అయితే, కొన్నాళ్లుగా రివ్యూల విషయంలో జడేజా అంచనాలు తప్పుతున్నాయి. దీంతో చాలా రివ్యూలు వృథా అవుతున్నాయి. శ్రీలంకతో రెండో టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేశర నువాంతు ఎల్బీడబ్ల్యూ కోసం కెప్టెన్ గిల్‌ను డీఆర్ఎస్ కోసం ఒప్పించాడు. అయితే, సమీక్షలో బంతి బ్యాట్‌కు తగిలినట్లు తేలింది. జడ్డూ గత మూడేళ్లలో వరుసగా 22 రివ్యూలు తీసుకోగా.. 18 విఫలమయ్యాయి. నాలుగు అంపైర్స్ కాల్ అయ్యాయి. చివరగా అతను తీసుకున్న రివ్యూ 2023లో సక్సెస్ అయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా జడ్డూ డీఆర్ఎస్ విజయవంతం కావట్లేదు.

# నా కెరీర్ నాశనమైంది: స్కూల్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ దావా



విల్ పుకోవిస్కి (Will Pucovski).. ఆస్ట్రేలియా తరపున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడి 27 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచులు ఆడాడు. ఇంత త్వరగా అతడు ఆటకు గుడ్‌బై చెప్పడానికి కారణం విపరీతంగా గాయాలు కావడమే. అయితే, ఇలా జరగడానికి మాత్రం తాను చదువుకున్న స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీనేజర్‌గా విల్ 2014లో మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఆ సమయంలో ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. తలకు గాయం కాగా.. స్కూల్ యాజమాన్యం మాత్రం సరైన వైద్యం అందించలేదని.. అందుకే తన క్రికెట్ కెరీర్‌లో 13సార్లు కంకషన్ ఎదుర్కోవాల్సి వచ్చిందని విల్ ఆరోపించాడు. దీంతో 2024లో క్రీడలకు వీడ్కోలు చెప్పాలని స్వతంత్ర మెడికల్ ప్యానల్ రికమెండ్ చేసినట్లు గుర్తు చేశాడు.

# సెప్టెంబర్ 18న బీసీసీఐ ఏజీఎం.. ఆ ఇద్దరి అంశం చర్చకు వచ్చేనా..?

భారత క్రికెట్ బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశం ముంబయి వేదికగా సెప్టెంబర్ 18న జరగనుంది. బీసీసీఐ ఎన్నికలు కూడా అదే రోజున నిర్వహించనున్నారు. రెండు ప్రధాన అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పనితీరుపై విశ్లేషణ చేస్తుందో లేదో చూడాలి. మరోవైపు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడింగిపుపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఎన్నికల నిర్వహణ ఇలా..**

బీసీసీఐ ఇప్పటికే సభ్యులకు నోటిఫికేషన్‌ను పంపింది. ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చాల్సిన తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవాలని సూచించింది. అందుకోసం ఆగస్టు 31 వరకు గడువు ఉంది. ఓటర్ల జాబితా ముసాయిదాను సెప్టెంబర్ 1న రిలీజ్ చేయనుంది. సభ్యులుగా ఎన్నికయ్యేందుకు నామినేషన్లను సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో దాఖలు చేయాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 12న అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతోపాటు ఆ రోజే ఎన్నికలు జరుగుతాయి. సెప్టెంబర్ 18న ఫలితాలు వెల్లడవుతాయి.

**ఐపీఎల్‌తోపాటు ఐసీసీలోకి..**

ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిలింగ్‌లోకి కొత్తగా ప్రతినిధులను తీసుకోవడంపై వార్షిక సమావేశంలో బీసీసీఐ నిర్ణయం తీసుకోనుంది. ఇద్దరిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఐసీసీలో భారత్ తరపున ప్రతినిధిగా ఎవరిని నియమించాలనే దానిపైనా చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఐసీసీ ఛైర్మన్‌గా భారత్‌కు చెందిన జైషా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. మరోవైపు అండమాన్, నికోబార్ క్రికెట్ సంఘాలకు బీసీసీఐ అసోసియేట్ మెంబర్‌షిప్ ఇచ్చేందుకు ఆమోద ముద్ర వేయనుంది. బీసీసీఐకి అనుబంధంగా మారితే అండమాన్, నికోబార్‌లో క్రికెట్ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. సభ్యులకు పంపించిన సర్క్యులర్‌లోనూ ఈ ప్రతిపాదనను ఉంచింది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945